


# విజయభాను





విశాఖపట్నం, ఆదివారం 20-09-2020 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 11 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## ఎన్ఈపీతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది

### రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



న్యూఢిల్లీ: జాతీయ విద్యా విధానంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తన అభిప్రాయాలను వెల్లడించారు. ఎన్ఈపీ 2020.. ఉన్నత విద్య అంశంపై జరిగిన విజిటర్స్ కాన్ఫరెన్స్ సదస్సులో ఆయన వర్చువల్ సందేశం ఇచ్చారు. 21వ శతాబ్ధపు లక్ష్యాలను అందుకునే విధంగా కొత్త ఎన్ఈపీ విద్యావ్యవస్థను మార్చివేస్తుందని అన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ సమాన, ఉత్తేజపూరిత సమాజాన్ని స్థాపించేందుకు ఎన్ఈపీ పనిచేస్తుందన్నారు. మార్క్ లు, గ్రేడ్లు, పాత బోధనా విధానాలను నిరుత్సహపరి చేందుకు కొత్త ఎన్ఈపీ ఉపయోగ పడుతుందని రాష్ట్రపతి కోవింద్ తెలిపారు. ఎన్ఈపీతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతందన్నారు.

ప్రాచీన కాలంలో విద్యా క్షేత్రంగా భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా పేరుందన్నారు. తక్షశిల, నలంద వర్సిటీలకు ప్రత్యేక గుర్తింపుఉన్నదన్నారు.

కానీ నేటి ఉన్నత విద్యా సంస్థలకు మాత్రం గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో మంచి పొజిషన్ రావడం లేదన్నారు. ఎన్ఈపీ ద్వారా బోధనకు భారత్ మళ్లీ కేంద్రంగా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

2035 లోగా ఉన్నత విద్యలో ఎన్‌రోల్మెంట్‌ను 50 శాతానికి పెంచాలని ఎన్ఈపీ టార్గెట్‌లో ఉందన్నారు. టెక్నాలజీతో ఈ టార్గెట్ సాధ్యమే అని ఆయన తెలిపారు.

## వ్యవస్థలను చంద్రబాబు భ్రష్టు పట్టించారు : మంత్రి పేర్ని నాని



తాడేపల్లి: వ్యవస్థలను చంద్రబాబు భ్రష్టు పట్టించారని, తన అనుకూల మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర రవాణా, సమాచార శాఖ మంత్రి పేర్నినాని మండిపడ్డారు. శనివారం ఆయన తాడేపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ "టీడీపీకి క్రియాశీలకంగా వ్యవహరించిన వ్యక్తులు.. ఇప్పుడు న్యాయ వ్యవస్థలో ఉన్నారు. మిథున్‌రెడ్డి

తరువాయి 2లో..

## రాష్ట్రంలో సాగునీటి రంగానికి చెందిన ప్రాజెక్ట్‌లు లక్ష్యం

### ఐదేళ్లలో సాగునీటి కోసం రూ. లక్ష కోట్లు

### పోలవరం వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో చురుగ్గా పనులు

### ఏపీలో సాగునీటి ప్రాజెక్ట్‌పై సీఎం వైఎస్ జగన్ ప్రణాళికలు



అమరావతి : రాష్ట్రంలో సాగునీటి రంగానికి చెందిన ప్రాజెక్ట్‌లు లక్ష్యం మేరకు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తోంది. ఇందుకోసం పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్ లు లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయడంతో పాటు కొత్తవాటి కోసం మొత్తం ఐదేళ్లలో కనీసం రూ. 96550 కోట్లు వ్యయం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇందులో నిర్మాణంలో ఉన్న వాటిని రూ.84092 కోట్లు వ్యయం చేయాలి. అలాగే కొత్త ప్రాజెక్ట్ లు పూర్తి చేయడానికి రూ.72458 కోట్లు ఖర్చు చేయాలి. ఈ నిధులు సమీకరణకు అవసరమైన చర్యలను ప్రభుత్వం ఎస్పీవీలు (స్పెషల్ పర్పస్ వెహికల్) ఏర్పాటు చేస్తుంది.

ఓ వైపు పోలవరం వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో చురుగ్గా పనులు చేయిస్తున్న ప్రభుత్వం, మరోవైపు ఇతర ప్రాజెక్ట్‌పైన అదే విధంగా దృష్టి పెట్టింది. పోలవరం ప్రాజెక్ట్లో కుడి, ఎడమ కాలువులు గతంలోనే వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పూర్తయ్యాయి. ప్రధాన జలాశయ నిర్మాణ పనులు నత్తనడకన నడుస్తుండడంతో గతంలో పనిచేసిన సంస్థను ప్రభుత్వం రద్దు చేసి మేఘా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(ఎంఈఐఎల్)కు అప్పగించిన సంగతి తెలిసింది. అప్పటి నుంచి ఈ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి దాకా మొత్తం ప్రాజెక్ట్లో 71.46 శాతం పనులు పూర్తి కాగా ప్రస్తుతం జరుగుతున్న పనులన్నీ కీలకమైనవి. స్పిల్ వే కాంక్రీట్, స్పిల్ వే ఛానెల్ లలో ఎంఈఐఎల్ పనిచేపట్టిన తరువాత 2.80 లక్షల ఘనపు మీటర్ల పని ఆరు నెలల కాలంలో జరిగింది. అదే సమయంలో స్పిల్ ఛానెల్, పవర్ హౌజు, గ్యాప్-1,2,3 లకు సంబంధించిన మట్టి, రాతికట్టి, కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి.

ప్రస్తుతం గోదావరికి వరదలు ఉన్నప్పటికీ పనులు ఆగకుండా స్పిల్ వే కాంక్రీట్ బ్రిడ్జ్ పనులు చేస్తున్నారు. అదే సమయంలో జల విద్యుత్ ప్రాజెక్ట్ పనులను కొనసాగిస్తున్నారు. వరద తగ్గిన తరువాత అప్పర్, లోయర్ కాఫర్ డ్యాంలతో పాటు స్పిల్ ఛానెల్, పైలెట్ ఛానెల్లను గ్యాప్ - 1,2,3 పనులను ఎంఈఐఎల్ ఏకకాలంలో చేపడుతుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో గతంలో చేపట్టిన పనులను పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి జగన్ మూడు రకాల ప్రాధాన్యతలను నిర్ణయించారు. అందులో భాగంగా వచ్చే ఏడాది కొన్ని ప్రాజెక్ట్ లను వినియోగంలోకి తెచ్చేందుకు బడ్జెట్లు కేటాయించగా ఇతర ప్రాజెక్ట్ లను మూడు నుంచి నాలుగేళ్ళ సమయంలో పూర్తి చేయడానికి లక్షాలను నిర్దేశించారు.

ప్రాజెక్ట్ల పూర్తికి నిధుల కొరత ప్రధాన అవరోధం కానుంది. దీనిని ఎదుర్కొనేందుకు ఎసస్పీవీలను ఏర్పాటు చేశారు. అందులో ఎస్పీవీ-1 కింద రాయలసీమలో కరువు నివారణకు రూ.39980కోట్లు

తరువాయి 2లో..

## సీఎం జగన్ గట్స్ ఉన్న నాయకుడు

### ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్

### వాసుపల్లి కుమారులకు కండువా వేసిన సీఎం జగన్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానం



విశాఖపట్నం : సౌత్ తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో భేటీ అయ్యారు. గత కొన్ని రోజులుగా టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్యే గణేష్.. శనివారం తన కుమారులతో కలిసి సీఎం క్యాంప్ ఆఫీసుకు వెళ్లి జగన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వాసుపల్లి కుమారులకు కండువా కప్పిన సీఎం జగన్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అయితే ఎమ్మెల్యే గణేష్‌కు మాత్రం పార్టీ కండువా కప్పలేదు. అనంతరం మీడియాతో మాట్లాడిన

తరువాయి 2లో..

## సచివాలయ పరీక్షలు నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

విజయవాడ : గ్రామ, వార్డు సచివాలయ పోస్టుల భర్తీకి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని మున్సిపల్ శాఖ కమిషనర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 16,802 సచివాలయ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహిస్తున్నాం. కోవిడ్ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. 2 వేల పరీక్ష కేంద్రాల్లో పరీక్షల కోసం ఏర్పాట్లు చేశాం. పరీక్ష కేంద్రంలో ఒక్కో గదిలో కేవలం 16 మందినే అనుమతిస్తాం.

కోవిడ్ ఉన్నవారి కోసం ప్రత్యేక ఐసోలేషన్ పరీక్ష కేంద్రాలు పెట్టాం. అభ్యర్థుల కోసం విశాఖ, విజయవాడలో సిటీ బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. ఇన్విజిలేటర్లకు పీపీఈ కిట్లు ఇస్తున్నాం.

ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించం. పరీక్షకు వచ్చేవారికి స్క్రీనింగ్, శానిటేషన్ ఏర్పాటు చేస్తున్నాం' అని మున్సిపల్‌శాఖ కమిషనర్ విజయ్‌కుమార్ వివరించారు.

## పెద్దశేష వాహనంపై దర్శనం ఇవ్వనున్న శ్రీవారు



తిరుమల : దేవదేవుడి సాలకట్ల బ్రహ్మోత్సవాల కోసం దేశవ్యాప్తంగా భక్తులు ఎదురుచూసేవారు. కలియుగ వైకుంఠంలో శ్రీవారి ఉత్సవాలను కనులారా తిలకించేందుకు వడివడిగా తిరుమల గిరులు చేరుకునేవారు. ఉత్సవాల్లో రోజూ లక్షలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకునేవారు. ఎప్పుడు బ్రహ్మోత్సవాలు నిర్వహించినా అలాంటి పరిస్థితే తెరపైకి వచ్చేది. కానీ ఈ ఏడాది కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో జనరద్దీని కట్టడి చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ప్రత్యేక చర్యలు చేపట్టింది. బ్రహ్మోత్సవాలను గుడి ప్రాకారం లోపలే నిర్వహించాలని తలపెట్టింది.

తిరుమల చరిత్రలోనే తొలిసారి కోవిడ్ కారణంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఏకాంతంగా నిర్వహించాలని టీటీడీ సంకల్పించింది. అందులో భాగంగానే అర్చకులు గరుడ ధ్వజ పటాన్ని ధ్వజ స్తంభంపై ఎగురవేశారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సకల దేవతలకు ఆహ్వానము.. శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీవారి ఆలయం ముందు ఎల్‌సీడీల ద్వారా భక్తులకు వీకక్షించే సౌకర్యం కల్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు పెద్దశేష వాహనంపై మలయప్పస్వామి రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు భక్తులకు దర్శనం ఇవ్వనన్నారు.

## 9 మంది ఆల్‌ఖయిదా ఉగ్రవాదులు అరెస్టు

### భారీ కుట్ర.. భగ్నం



న్యూఢిల్లీ: ఆల్ ఖయిదా ఉగ్రవాద సంస్థతో సంబంధం ఉన్న 9 మందిని జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌తో పాటు కేరళలోని ఎర్నాకుళం నుంచి వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు చోట్ల ఎన్ఐఏ అధికారులు ఇవాళ సోదాలు నిర్వహించి వారిని అరెస్టు చేశారు. ఈ అరెస్టులకు సంబంధించి మరింత సమాచారం అందాల్సి ఉన్నది. ప్రాథమిక విచారణ ప్రకారం.. పాకిస్థాన్‌కు చెందిన ఆల్ ఖయిదా ఉగ్రవాదులు సోషల్ మీడియా ద్వారా భారత్‌లోని వారిని ప్రేరేపించినట్లు తెలుస్తోంది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో దాడులకు పాల్పడే విధంగా రెచ్చగొట్టినట్లు దర్యాప్తు ద్వారా భావిస్తున్నారు. ఆల్ ఖయిదా మద్దతుదారులు నిధుల సమీకరణ కోసం విస్తృతంగా పర్యటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయుధాలు, పేలుడు పదార్థాలు కొనేందుకు కొందరు ఢిల్లీకి కూడా వెళ్లేందుకు ప్లాన్ వేసినట్లు తేలింది.

ఉగ్రవాదులు లియు

తరువాయి 2లో..




# సచివాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



శ్రీకాకుళం : పిఎన్ కాలనీ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ జె నివాస్ శనివారం తనిఖీ చేశారు. సచివాలయం నుండి అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పోస్టర్లు, ఇతర సమాచారం, లబ్ధిదారుల జాబితాలు ప్రజల పరిశీలనకు ప్రదర్శించారా ? లేదా అని గమనించారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది కోవిడ్ సందర్భంగా చేపట్టిన ఇంటింటి సర్వే చేసిన పరిస్థితిని తనిఖీ చేశారు. సర్వేలో ఏ ఒక్కరిని విడిచి పెట్టలేదని తద్వారా కోవిడ్ లేకుండా నిర్మూలించవచ్చని జిల్లా కలెక్టర్ అన్నారు. వైరస్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని సూచిస్తూ అనారోగ్యం బారిన ఉన్నవారు ఏ ఒక్కరూ ఇంటివద్ద ఉండరాదని అన్నారు. కొంతమంది కరోనా పరీక్షలకు ముందుకు రావడం లేదని వాలంటీర్లు, సిబ్బంది జిల్లా కలెక్టర్ కు తెలియజేయగా అటువంటి వారి వద్ద నుండి ప్రభుత్వం నుండి ఎటువంటి సేవలు అవసరం లేదని వ్రాతపూర్వకంగా తీసుకో తీసుకోవాలని సూచించారు. తీవ్ర అస్వస్థతకు గురైన పుడు ఎటువంటి సహాయం అందే పరిస్థితి ఉండదని గమనించాలని, అది స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. వాలంటీర్ల, సిబ్బంది మంచి సేవలు అందిస్తున్నారని కలెక్టర్ ప్రశంసించారు. వృత్తిలో మంచి సేవలు అందించడం లక్ష్యంగా పెట్టుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు మంచి సేవలు అందించడమే పరమావధి, తద్వారా సంతృప్తి కలుగుతుందని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు, బియ్యం కార్డు, పింఛను, ఆరోగ్యశ్రీ కార్డు అందించడంలో ఎటువంటి జాప్యం జరగ రాదని ఆయన ఆదేశించారు.

ఈ నాలుగు అవసరాలకు ఎక్కువ మంది సచివాలయానికి వస్తారని వారికి మెరుగైన సేవలు అందించి పంపించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో సేవలు అండాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతి పథకానికి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వారిని గుర్తించాలని అటువంటి జాబితాను సచివాలయం వద్ద ప్రదర్శించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. పథకాల అమలులో పారదర్శకత స్పష్టంగా ఉండాలని అదే ప్రభుత్వ విధానమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలు వారి వద్దకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్న సంగతిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.

సచివాలయాల ఏర్పాటు అందులో భాగమేనని అన్నారు. యువతగా అద్భుతమైన పనితీరు కనిపించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకట రావు , ఆయుష్ వైద్య అధికారి సి.హెచ్. మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## లాక్‌డౌన్ పాక్షికంగా సడలింపు

చేపలు, మాంసాహార దుకాణాలు, మార్కెట్లకు అనుమతి లేదు

శ్రీకాకుళం : ఆదివారం సచివాలయ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా శ్రీకాకుళం పట్టణంలో లాక్ డౌన్ పాక్షికంగా సడలింపు ఇచ్చారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జె నివాస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం పట్టణంలో కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఆదివారం రోజున కూడా లాక్ డౌన్ విధించిన సంగతి తెలిసిందే. అయితే ఆదివారం సచివాలయ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా అధిక సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అభ్యర్థులకు ఆహార పానీయాలు, పరీక్షలకు సంబంధించిన పరికరాలు అవసరమయ్యే అవకాశం ఉందని, వాటికి ఇబ్బందులు తలెత్తకుండా లాక్ డౌన్ కు సడలింపు ఇచ్చామన్నారు. అభ్యర్థులు దేనికి ఇబ్బందులకు గురి కారాదని ప్రశాంతంగా పరీక్షలు రాసి సంతోషంగా వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.

పాక్షికంగా సడలింపు ఇచ్చినప్పటికీ చేపలు, మాంసాహారానికి సంబంధించిన దుకాణాలు, మార్కెట్లకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. హెూటళ్లు, ఇతర దుకాణాలు అనుమతించటం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ "ఆప్కో" దసరా దీపావళి పండుగ సందర్భంలో ఎంపిక చేసిన వస్త్రాలపై ఒకటి కొంటే ఒకటి ఉచితం 1o1 మెగా ఆఫర్ , ఒకటి కొంటే రెండు ఉచితం 1o2 బంపర్ ఆఫర్ మరియు అన్నిరకాల వస్త్రాలపై 30శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తుందని విశాఖపట్నం డివిజనల్ మార్కెటింగ్ అధికారి టి.జగదీశ్వరరావు, విశాఖ మెయిన్ బ్రాంచ్ సిరిపురం మేనేజర్ బి.విశ్వేశ్వరరావు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని రకాల చేనేత ఉత్పత్తులు అనగా ధర్మవరం మాధవరం వెంకటగిరి మంగళగిరి బందరు గుంటూరు రాజమండ్రి ఉప్పాడ పట్టు కాటన్ చీరలు దోవతులు దుప్పట్లు లుంగీలు రుమాళ్ళు షర్టింగ్ డ్రస్ మెటీరియల్ మొదలైనవి అన్ని ఆప్కో విక్రయ శాలలలో లభించునని చేనేత వస్త్రములు విరివిగా కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించవలసినదిగా కోరారు.
వివరాలకు 8008364957.

### జాతీయ పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోండి

- విభిన్న ప్రతిభావంతులకు పిలుపునిచ్చిన సహాయ సంచాలకులు కె.జీవనబాబు

శ్రీకాకుళం : జిల్లాలోని వివిధ రంగాలలో అత్యంత ప్రతిభ కనబరచిన విభిన్న ప్రతిభావంతులు, స్వచ్ఛంధ సంస్థలు భారత ప్రభుత్వం అందించే జాతీయ అవార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.జీవనబాబు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురష్కరించుకొని సాంఘిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారు విభిన్నప్రతిభావంతులకు, స్వచ్ఛంధ సంస్థలకు అందించే జాతీయ పురస్కారం 2020కు దరఖాస్తులను కోరుతున్నట్లు ఆయన చెప్పారు. దివ్యాంగుల పునరావాసం, స్వయం ఉపాధి, ఉద్యోగకల్పన, సాంకేతికత, క్రీడలు, అవరోధ రహిత వాతావరణం, అత్యుత్తమ సృజనాజ్మకత కలిగిన విభిన్నప్రతిభావంతులైన వయోజనులు, ఉత్తమ సృజనాత్మకత కలిగిన విభిన్నప్రతిభావంతులైన చిన్నారులు, ఉత్తమ బ్రెయిలీ ప్రెస్, ఉత్తమ ప్రాప్యత కలిగిన వెబ్ సైట్ మొదలగు రంగాల్లో కృషిచేసి అత్యంత ప్రతిభ కనబరచిన విభిన్న ప్రతిభావంతులు, స్వచ్ఛంధ సంస్థలు ఈ పురస్కారానికి అర్హులని చెప్పారు. ఆసక్తి గల విభిన్నప్రతిభావంతులైన చిన్నారులు, వయోజనులు, స్వచ్ఛంధ సంస్థలు ఈ నెల 21లోగా సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, శ్రీకాకుళం వారికి మూడు సెట్లు సమర్పించాలని ఆ ప్రకటనలో కోరారు. ఇతర వివరాలు, నిబంధనల కొరకు www.disabilityaffairs.gov.in వెబ్ సైట్ ను సందర్శించాలని లేదా 08942 240519 నెంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన ఆ ప్రకటనలో స్పష్టం చేసారు.

# చొంపిలో చిన్నారులకు టి షర్ట్స్ పంపిణీ



అరకు : అల్లూరి విజయవాణి మరియు ప్రసాద్ వారి ఆర్థిక సహాయంతో అరకులోయ మండలం చొంపి గ్రామంలో ఎచ్.ఆర్.ఏ.సి.ఏ జిల్లా మహిళ అధ్యక్షురాలు కె. కృష్ణకుమారి ఆధ్వర్యంలో ఏభై మంది చిన్నారులకు టి షర్ట్స్ పంచిపెట్టారు.

ఈ సందర్భంగా ఆమెను చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

### రాష్ట్రంలో సాగునీటి రంగానికి చెందిన ప్రాజెక్ట్‌లు లక్ష్యం

ఐదేళ్లలో ఖర్చు చేయనున్నారు. ఎస్పీవీ-2 కింది ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టు పూర్తిచేయడానికి ఐదేళ్ల కాలంలో రూ. 8787 కోట్లు ఖర్చు చేస్తారు. ఎస్పీవీ - 3 ద్వారా ఏపి రాష్ట్ర నీటి రక్షణ అభివృద్ధి కార్యక్రమం పేరుతో రూ.12702 కోట్లు ఐదేళ్ల కాలంలో సమీకరించనున్నారు. ఎస్పీవీ-4 పేరుతో పలనాడు కరువు నివారణ కార్యక్రమం ద్వారా ప్రధానంగా గోదావరి, కృష్ణా - పెన్నాల అనుసంధానం కోసం రూ.7636కోట్లు ఐదేళ్ల కాలంలో ఖర్చు చేస్తారు. ఎస్పీవీ-5 కార్యక్రమం క్రింద కృష్ణా-కొల్లేరు సెలినిటి మిటిగేషన్ కార్యక్రమం ద్వారా రూ.3356 కోట్లు సమీకరిస్తారు. సాగునీటి ప్రాజెక్టుకు నిధుల సమీకరణకు ఎస్పీవీలు ఏర్పాటు చేయడం అరుదైనది కాగా, ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పట్టుదల వల్ల వ్యూహాత్మకంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టను పరుగులు పెట్టించి వృధాగా పోతున్న నీటిని ఒడిసి పట్టడానికి ప్రణాళికలను రూపొందిస్తోంది. ఇటీవలే ముఖ్యమంత్రి పోలవరం, ఉత్తరాంధ్రతో పాటు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రాజెక్టుల పనుల పురోగతిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఐదేళ్ళలో రూ. 39980 ఖర్చు..

ఆ క్రమంలో నెల్లూరు బ్యారేజీ, సంగం బ్యారేజీ, అవుకు సొరంగం%--%2, పూల సుబ్బయ్య వెలిగొండ-హెడ్ రెగ్యులేటర్ పనులు, వంశధార%--%నాగావళి లింక్, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు స్టేజ్-2 రెండో దశ, పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఆలస్యం కాకుండా పనులు పరుగులు పెట్టించాలన్నారు. చిత్రావతి బాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 10 టీఎంసీలు, గండికోట రిజర్వాయర్‌లో ఈ ఏడాది కచ్చితంగా కనీసం 23 టీఎంసీల నీరు నిల్వ చేయాలని, వెంటనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి, గత ప్రభుత్వం రైతులకు ఎకరాకు కేవలం రూ.6.75 లక్షల పరిహారం ఇస్తే, ఇప్పుడు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తున్నామని అలాగే ఆ ప్రాజెక్ట్ ల్లో నీరు నిండితే ఆయా ప్రాంత రైతులు ఉపయోగకరం అన్న విషయంపై రైతులకు నచ్చచెప్పి, అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఈ ఏడాది నవంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నెల్లూరు బ్యారేజీ, సంగం బ్యారేజీ పనులు వేగంగా పూర్తి చేయాలని, ప్రకాశం జిల్లాలోని పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటరీ పనులకు సంబంధించి, ఈ ప్రాజెక్టులో మొదటి సొరంగం పనులు ఇప్పటికే పూర్తి కాగా, రెండో సొరంగం పనులను వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

### వ్యవస్థలను చంద్రబాబు భ్రష్టు పట్టించారు

లేవనెత్తిన అంశంపై కేంద్రం, సుప్రీంకోర్టు దృష్టి సారించాలి. ఏపీ న్యాయవ్యవస్థ తీరుపై ప్రతి ఒక్కరూ స్పందించాలని" ఆయన కోరారు. అమరావతి పేరుతో లీటరుపై రూ.2 పెంచినప్పుడు ఎల్లో మీడియా ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. మీడియా దృతరాష్ట్ర దృష్టితో కాకుండా ధర్మదృష్టితో చూడాలని మంత్రి పేర్ని నాని హితవు పలికారు.

### 9 మంది ఆల్‌ఖయిదా ఉగ్రవాదులు అరెస్టు

యెన్ అహ్మద్, అబు సూఫియాన్‌లను బెంగాల్ నుంచి అరెస్టు చేయగా.. మొసారఫ్ హుస్సేన్, ముర్షీద్ హసన్‌లను కేరళ నుంచి అరెస్టు చేసినట్లు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ పేర్కొన్నది. 9 మంది ఆల్ ఖయిదా అనుచరులను అరెస్టు చేయడం వల్ల ఉగ్రదాడులను నివారించినట్లు ఎన్ఐఏ పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారి నుంచి నిషేధిత వస్తువులు, డాక్యుమెంట్లు, డిజిటల్ డివైస్‌లు, జిహాదీ సాహిత్యం, ఆయుధాలు, దేశీయ పిస్తోళ్లు, బాడీ ఆర్మర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఐఏ చెప్పింది. నాటు పేలుడు పదార్థాలను కూడా సీజ్ చేసినట్లు చెప్పారు.

# సీఎం జగన్ గట్స్ ఉన్న నాయకుడు



గణేష్.. తన కుమారులు వాసుపల్లి సాకేత్, వాసుపల్లి సూర్య వైసీపీలో చేరడం చాలా ఆనందంగా ఉందన్నారు. తాను కూడా వైసీపీకి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి సైతం పార్టీలోకి ఎమ్మెల్యే గణేష్ కుమారులు మాత్రమే చేరినట్లు వ్యాఖ్యానించారు. అయితే గతంలో టీడీపీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి పార్టీ కండువా కప్పిన సీఎం జగన్.. ఎమ్మెల్యే గణేష్‌కు మాత్రం కప్పలేదు. గతంలో జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నుంచి గెలిచిన వారు పార్టీ చేరాలంటే పదవులకు రాజీనామా చేయాల్సి ఉంటుందని చెప్పేవారు. తాజాగా, వైసీపీలో చేరుతున్న టీడీపీ ఎమ్మెల్యేలను మాత్రం నేరుగా వైసీపీలో చేర్చుకోకుండా, అనుబంధ సభ్యులుగా గుర్తిస్తున్నారు. ఇదే కోవలో ఎమ్మెల్యే గణేష్‌కు పార్టీ కండువా కప్పలేదని విశేషకులు భావిస్తున్నారు.

అలాగే ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా పాలనతో అన్ని వర్గాల ప్రజలు వైసీపీ వైపు ఆకర్షితులతున్నారని చెప్పారు. ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని తెలిపారు. తన కుమారులు కూడా వైఎస్సార్‌సీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. సీఎం జగన్ గట్స్ ఉన్న నాయకుడని, ఆయన ధైర్యమే రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ క్షేత్రస్థాయిలో అందరికీ చేరుతున్నాయన్నాయని చెప్పారు. విశాఖ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ ఇక ముందుకు వస్తుందని తనకు అనిపించడం లేదని వ్యాఖ్యానించారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. వాసుపల్లి గణేష్ కుటుంబం విశాఖ ప్రజల కోసం చేస్తున్న సేవలు హర్షణీయమన్నారు. వాసుపల్లి గణేష్ కుమారులు పార్టీలోకి రావడం బలాన్ని ఇస్తుందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి టీడీపీలోని విద్యావంతులు పార్టీలోకి వస్తున్నారని తెలిపారు.

భవిష్యత్తులో వైసీపీలోకి చాలా మంది వస్తారని జోస్యం చెప్పారు. విశాఖలో టీడీపీ తుడుచుపెట్టుకు పోతుందని జోస్యం చెప్పారు.

# విశాఖ టీడీపీ నాయకులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

## పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, డివిజన్ పార్టీ బాధ్యులు



విశాఖపట్నం : విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ నాయకులతో శనివారం సాయంత్రం జరిగిన టెలికాన్ఫరెన్స్ లో నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు.

టిడిపి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ వైసిపిలో చేరడాన్ని విశాఖ టిడిపి నాయకులంతా ముక్తకంఠంతో ఖండించారు. ప్రజల నుంచి వసూళ్లు చేసిన జె ట్యాక్స్ లతో టిడిపి ఎమ్మెల్యేలను కొంటున్నారని, సంతలో పశువులను కొన్నట్లు కొనుగోళ్లు చేస్తున్నారని, వైసిపి డబ్బులకు అమ్ముడుపోవడం దుర్మార్గంగా ధ్వజమెత్తారు.

విలువలతో కూడిన రాజకీయం చేస్తామని, రాజీనామా చేసివస్తేనే వైసిపిలో చేర్చుకుంటామని సీఎం జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వల్లించిన నీతిపన్నాలు ఏమైనాయని విశాఖ టిడిపి నాయకులు మండిపడ్డారు. '' టిడిపినుంచి మేము ఎవరినైనా తీసుకుంటే, వారిని ఖచ్చితంగా రాజీనామా చేయించిన తరువాతే తీసుకుంటామని గట్టిగా చెబుతున్నాము. అలాంటిది ఏమైనా పొరపాటున జరిగితే వెంటనే డిస్ క్వాలిఫై చేయండని మీకు విన్నవిస్తున్నాను. ఇటువంటి గొప్పగొప్ప ప్రాక్టీసులన్నీ మళ్లీ శాసనసభకు వస్తాయని సంపూర్ణంగా నమ్ముతూ, మీరు ఆ పని చేయగలుగుతారని సంపూర్ణంగా ఆశిస్తున్నాను, ఆల్ ది బెస్ట్'' అని 13జూన్ 2019న జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలను గుర్తు చేశారు. దానికి అసెంబ్లీ స్పీకర్ సమాధానంగా, ''ఇప్పుడు పెద్దలు చాలామంది మోరల్స్ గురించి, యాంటి డిఫెక్షన్ లా గురించి చెప్పారు. దానికి ఒక కంక్లూజన్ ఎక్కడో ఒక దగ్గర రావాలి. సభానాయకుడు గారు మేము ఫిరాయింపులను ప్రోత్సహించం అని ఒకమాట అన్నారు. ఐయామ్ వెరీ హ్యాపి. ఒకవేళ ఎవరైనా సరే అలాంటి పరిస్థితే వస్తే, రాజీనామా చేసివచ్చి గెలిచి మరలా రావాలన్నదే ఆకాంక్షగా తమ్మినేని సీతారామ్ అన్న వ్యాఖ్యలు ఏమయ్యాయని విశాఖ టిడిపి నాయకులు ఈ టెలికాన్ఫరెన్స్ లో ప్రశ్నించారు.


**టెలికాన్ఫరెన్స్ లో చంద్రబాబు ప్రసంగం:**

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, " ప్రలోభాలకు లోనై పార్టీకి ద్రోహం చేయడం హేయం. వ్యక్తిగత స్వార్థంతో పార్టీకి ద్రోహం చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు ఎన్నికష్టాలు ఎదురైనా కార్యకర్తలు టిడిపి వెన్నంటే ఉంటారు. స్వార్థంతో ఒకరిద్దరు పార్టీనుంచి పోయినా నష్టం లేదు. నాయకులు వస్తారు పోతారు, పార్టీ శాశ్వతం, కార్యకర్తలు శాశ్వతం. కార్యకర్తల అభిమానం, ప్రజాదరణ తెలుగుదేశం సొంతం. జెండాను మోసి గెలిపించేది కార్యకర్తలే.. జెండా పంచన చేరిన నాయకులు కొందరు పార్టీకి ద్రోహం చేయడం దుర్మార్గం ద్రోహులకు తెలుగుదేశం పార్టీలో స్థానం లేదు. ప్రజల గుండెల్లో నుంచి టిడిపిని ఎవరూ తొలగించలేరు. పార్టీకి ద్రోహం చేసినవాళ్లకు రాజకీయ సమాధే.

విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కంచుకోట. హుద్ హుద్ లో టిడిపి కష్టాన్ని ప్రజలు మరిచిపోరు. టిడిపి 5ఏళ్ల పాలనలో విశాఖ అభివృద్దికి పెద్దపీట. వేలకోట్ల పెట్టుబడులు విశాఖకు తెచ్చాం, లక్షలాది ఉద్యోగాలు కల్పించాం. అందుకే విశాఖ పట్టణంలో 4అసెంబ్లీ స్థానాల్లో టిడిపిని గెలిపించారు. వైసిపి వచ్చాక అన్నింటినీ నాశనం చేస్తోంది. వేలాది ఎకరాల భూములు కబ్జా చేశారు, ప్రశాంతంగా ఉండే విశాఖలో వైసిపి దందాలు. ఇళ్లస్థలాల ముసుగులో ల్యాండ్ స్కామ్ లు చేశారు, లెవలింగ్ పేరుతో వేల కోట్లు స్వాహా చేశారు. ప్రతి స్కీమ్ లో స్కామ్ లకు పాల్పడ్డారు. మొదట టిడిపి కార్యకర్తలు,నాయకులపై దాడులు చేశారు. తర్వాత బిసిలపై తప్పుడు కేసులు పెట్టారు. ఆ తర్వాత దళితులపై దమనకాండకు దిగారు. చివరికి దేవాలయాలపై దాడులకు కూడా తెగబడ్డారు. ప్రతి జిల్లాలో వైసిపి శాండ్-ల్యాండ్, మైన్-వైన్ మాఫియా మూకలు పేట్రేగి పోయాయి. వైసిపిపై ప్రజల్లో అసహ్యం పెరిగింది. వైసిపి దుర్మార్గాలపై ప్రజలే తిరుగుబాటు. వైసిపి అవినీతి-అరాచకాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫిరాయింపులకు జగన్మోహన్ రెడ్డి ప్రోత్సాహం. వైసిపి ప్రలోభాలకు కొందరు లొంగిపోయి పార్టీకి ద్రోహం చేయడాన్ని ఖండిస్తున్నాం. నీతి నిజాయితీ, చిత్తశుద్ధి లేని పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ . వైసిపి మైండ్ గేమ్ ను, కుట్రలను ప్రజలే తిప్పికొట్టాలి. టిడిపి కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేయాలి. వైసిపి అరాచకాలకు తగిన బుద్ధి చెప్పాలని" చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో విశాఖ టిడిపి నాయకులు, డివిజన్ బాధ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు

- రాష్ట్ర యువజన మత్స్యకార సమాఖ్య అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్



విశాఖపట్నం : గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న విశాఖ పరిపాలనా రాజధాని కోసం చేపడుతున్న ఉత్తరాంధ్ర ప్రజా ఆకాంక్ష దీక్ష కు రెండోరోజు కూడా విశేష స్పందన లభించింది వివిధ పార్టీ శ్రేణులు, సేవా సంస్థల నిర్వాహకులు,వివిధ కులాల పెద్దలు తో పాటు అధిక సంఖ్యలో సామాన్య ప్రజలు మద్దతు తెలుపుతూ ఉత్తరాంధ్ర వలసలు తగ్గి అభివృద్ధి జరగాలంటే విశాఖ కేంద్రంగా రాజధాని ఇవ్వాల్సిందే అని పెద్ద ఎత్తున నినందించారు దీక్ష చేపట్టిన రాష్ట్ర యువజన మత్స్య కార సమాఖ్య అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ మాట్లాడుతూ వెనకబడిన ప్రాంతాలు అభివృద్ధి కోసం తీసుకొచ్చిన పరిపాలన వికేంద్రకరణ లో బాగంగా ఏర్పాటు చేయబోతున్న విశాఖ కేంద్రంగా రాజధాని కోసం ఉత్తరాంధ్ర ప్రజలు తెలుపుతున్న మద్దతు చూస్తుంటే ప్రజలు మనసులో మూడు రాజధానులు అంశం ఎంత బలంగా నాటుకుపోయిందో తెలుస్తుంది అని అన్నారు ఈ దీక్షకు మద్దతు తెలిపిన వారిలో సభిరబేగం,కొప్పుల వెంకట్రావు తోట పద్మావతి,కొల్లి సింహాచలం,నీలపు లక్ష్మి, మెరుగు ఏళ్ళాజి, బెవరా మహేష్,రమేష్, బొడ్డేటి ప్రసాద్, లండ రమణ, సూర్య ప్రసాద్, తేజ తదితరులు పాల్గొన్నారు.

# 28 నుంచి డిగ్రీ చివరి సెమిస్టర్ పరీక్షలు

## యూజీ పరీక్షల డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి

ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం డిగ్రీ చివరి సెమిస్టర్ పరీక్షలను సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 9వ తేదీ వరకు నిర్వహిస్తామని యూజీ పరీక్షల డీన్ ఆచార్య డి.వి.ఆర్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం బిఎస్సీ కోర్సుకు, మధ్యాహ్నం నుంచి బిఏ, బికాం కోర్సులకు పరీక్షలు జరుగుతాయన్నారు. విశాఖపట్నం, విజయనగ రం జిల్లాలలోని ఏయూ పరిధిలో డిగ్రీ విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన సూచించారు. పూర్తి సమాచారం ఏయూ వెబ్సైట్ నుంచి పొందాలన్నారు.

ఈ నెల 21వ తేదీన ఏయూ అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో పరీక్షల నిర్వహణపై వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి వెబినార్ నిర్వహిస్తారన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై విధించిన సెస్ ఛార్జీలను రద్దు చేయాలి




విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై విధించిన సెస్ చార్జీలను రద్దు చేయాలని విశాఖపట్నం జిల్లా ఆటోరిక్షా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ కె రెహమాన్ డిమాండ్ చేశారు.

సెస్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ కోవిడ్ కారణంగా ఉపాధి అవకాశాలు కోల్పోయి ఆటో డ్రైవర్లు కుటుంబ పోషణ భారమైన రోడ్డున్న పడ్డారని, ఇలాంటి తరుణంలో వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై లీటరుకు 1 రూపాయి చొప్పున సెస్ విధించడం సరికాదని, వీరి జీవనం మరింత అస్తవ్యస్తం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరోమారు ఆలోచించి సెస్ ప్రతిపాదన నిర్ణయాన్ని ఉపసంహరణ చేసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎమ్ పైడిరాజు,ఆటో యూనియన్ ప్రతినిధులు కాసుబాబు, సింహాద్రి, అప్పలరాజు, గురుబాబు, శ్రీను, గురయ్య, లక్ష్మణ రావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎండోమెంట్ స్థలం లో ఆక్రమణలు తొలగింపు



భీమునిపట్నం : స్థానిక గొల్ల కుమ్మరి పాలెం లో సర్వే నెంబర్ 60/2,62/3 లో సుమారు ఐదు కోట్లు విలువ చేసే 2.27 సెంట్లగా కలిగి ఉన్న భూమిలో సర్వే నెంబర్ 60/2 గా కలిగిన భూమి 0.6 సెంట్స్ ఉన్న పాకను విశాఖ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శాంతి దేవస్థాన సిబ్బంది తో కలసి దురాక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివకేశవ స్వామి చెందిన ఎండోమెంట్ స్థలంలో చాలా కాలం నుంచి దురాక్రమణ చేసి ఉంటున్నారనీ, ఖాళీ చేయమని ఎన్ని సార్లు అధికారులు చెప్పిన వినకుండా వారు అక్కడే ఉండడం తో దేవాదాయ ధర్మాదాయ శాఖ ట్రిబ్యునల్ కోర్టు తీర్పు ప్రకారం వారిని ఆ స్థలం నుండి ఈ రోజు ఖాళీ చేయించామని తెలిపారు. ఇది ఇలా ఉండగా ప్రక్క స్థలం పాత సర్వే నంబర్ 68/5 పై ప్రస్తుత సర్వే నంబర్ 63/2 గా కలిగిన ఖాళీ గా ఉన్న దేవస్థాన భూమి 2.21 సెంట్లు భూమిని అమ్మకానికి సిద్దం చేసి ఆ స్థలంను వారు ఒక తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అమ్మడానికి ప్రయత్నాలు చేయడమే కాకుండా ఆస్థలంలో పోల్స్ వేయడంతో పోలీసులు దేవస్థానం అధికారులు వారిని అడ్డుకున్నారు. ఆక్రమణ చేయడానికి ప్రయత్నించిన వారికి సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా దేవస్థాన స్థలం బోర్డ్ తొలగించి నందుకు గాను సదరు ఆక్రమణ దారుల పై పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ భూమిలో ఉన్న మూడు పాకలను పోలీసు వారి సహాయంతో తొలగించి బోర్డు పెట్టారు. ఇటువంటి ఆక్రమణలు జరిపిన ఎంతటివారైనా ఉపేక్షించేది లేదనీ ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శాంతి కార్య నిర్వహణాదికారి. ఎన్ ఎల్ ఎన్ శాస్త్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీధర్, శ్రీనివాస రాజు, సి.ఐ జి శ్రీనివాసరావు, ఎస్.ఐ సంతోష్, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# నిండిన రైవాడ జలాశయం

## - అప్రమత్తంగా ఉన్న అధికారులు - 113.50 కి చేరితే గేట్లు ఎత్తివేత



దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 114.00 మీటర్లు కాగా ప్రస్తుతం 113.15 కి చేరింది. దీనితో జలాశయం అధికారులు అప్రమత్తం అయ్యారు. శుక్రవారం సాయంత్రం 82 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. జలాశయం నీటి సామర్థ్యం 3.6 టి ఎం సి లు కాగా ప్రస్తుతం 2.877 టి ఎం సి ల నీటి నిల్వలు ఉన్నాయి . ఇదిలా ఉండగా ఎడమ, కుడి కాలువలు ద్వారా 150 క్యూసెక్కుల నీరు సాగునీరు విడుదలవుతుంది . భారీ వర్షం కారణంగా జలాశయంలోకి 1411 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. జలాశయంలోకి వరద ఉధృతి పెరిగితే, స్పిల్ వే గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదిలే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# హిందూ దేవాలయాల పై దాడులును అరికట్టాలంటూ టీడీపీ నాయకులు నిరసన



సింహాచలం : ఆంధ్రప్రదేశ్ లో ఎన్నడూ లేనివిధంగా వరుసగా హిందూ దేవాలయాలలో ఘోరాలు మరియు దాడులు జరుగుతున్న నేపథ్యంలో వీటిని నిరసిస్తూ టీడీపీ అర్బన్ ఉపాధ్యక్షుడు పాశర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ భీమిలి నియోజకవర్గం పార్టీ కోర్ కమిటీ ఆధ్వర్యంలో తీవ్ర నిరశన వ్యక్తం చేసారు ఈ సందర్భంగా పాశర్ల మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా హిందూ దేవాలయాల పై దాడులు విపరీతంగా పెరిగాయని సింహాచలం దేవస్థానం లో అవినీతి విపరీతంగా పెరిగిందని అప్పన్న భూములుఅన్యాక్రాంతం అవుతున్నాయని దేవస్థానం భూములు ఖాజేయడనికి ఎన్నో స్కెచులు వేశారని అప్పన్న చందన యాత్ర దర్శనం రాజవంశీయులు కు దక్కలేదుగాని దొంగచాటుగా వరికినచిన వారికి దర్శనాలు చేయించారని దానిపై విచారణ చేపట్టారు గాని చర్యలు లేవని అన్నారు

రాష్ట్ర వ్యాప్తంగా హిందూ దేవాలయాల పై దాడులను అరికట్టాలని వీటన్నింటిపైనా సిబిఐ ఎంక్వైరీ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ భీమిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కోర్ కమిటీ మరియు 98 వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో 98 వ వార్డు అధ్యక్షుడు పిసిని వరహనారసింహం పంచదార్ల శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

# ద్రోణంరాజు శ్రీనివాస్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ప్రార్థిస్తూ పూజలు




విశాఖపట్నం : వైసిపి మాజీ యువజన విభాగం అధ్యక్షుడు విల్లూరి భాస్కర్ రావు పాత బస్ స్టాండ్ శ్రీ రామ ఆలయంలో "మహా శాంతి హోమాన్ని" భక్తిశ్రద్ధలతో జరిపించారు.. శ్రీరామచంద్రమూర్తి ఆయనకు ఆయురారోగ్యాలు అందించాలని.. ప్రార్థిస్తూ.. భక్తితో పూర్ణాహుతి సమర్పించారు. అంతకుముందు ఆయన త్వరగా కోలుకోవాలని వేడుకుంటూ ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు అభిషేకాలు జరిపించారు. విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ ద్రోణంరాజు శ్రీనివాస్ మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. పెద్దన్నలా.. అన్నివేళల్లో అండగా నిలిచి కొండంత భరోసాను అందించేవారని గుర్తు చేసుకున్నారు. తనను తమ్ముడు అని ఎంతో ఆప్యాయంగా.. పిలిచేవారని మననం చేసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని. శ్రీరామచంద్రుని పాదాలకు నమస్కరించి వేడుకుంటున్నట్లు తెలియజేశారు. ద్రోణంరాజు త్వరగా కోలుకోవాలని.. ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. పార్టీ శ్రేణులు మహా శాంతి హోమంలో పాల్గొన్నాయి.

### రూ.5 కోట్లతో వారపు సంతల అభివృద్ధి

పాడేరు : వారపుసంతల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఐటీడీఏ పీఓ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. మండలానికో ప్రధాన వారపు సంతను ఎంపిక చేసి వీటిని రూ.5 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. 11 మండలాల్లో 70 వన్‌ధన్ కేంద్రాలున్నట్లు చెప్పారు. వెలుగు ఏపీడీ నాగేశ్వరరావు, జీసీసీ డీఎం పార్వతమ్మ, విజయ్‌కుమార్,రోహిణి లు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధికి చేయూతనిచ్చిన ప్రభుత్వం వైసీపీ



సబ్బవరం : మహిళల అభివృద్ధికి చేయూతనిచ్చిన వైసీపీ ప్రభుత్వం సబ్బవరం మండల కేంద్రంలోని స్థానిక సీతారామ కళ్యాణం కల్యాణ మండపంలో డ్వాక్రా మహిళల సమావేశం జరిగింది ఈ సమావేశం శనివారం జరిగింది దానికి ఎమ్మెల్యే అదీప్ రాజు పాల్గొన్నారు ముందుగా అదిఫ్‌రాజు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు మాది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అన్నారు.

జగనన్న మహిళల కొరకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు లో డ్వాక్రా రుణమాఫీ అన్నారు ఉన్న ఉన్న మండలంలో ఉన్న అన్ని మహిళా గ్రూపులకు రుణమాఫీ చేస్తామన్నారు అంతేకాకుండా ప్రతి కుటుం బమూ లక్ష రూపాయల వరకు లబ్ధి పొందుతున్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయుడు సబ్బవరపు ముత్యాలనాయుడు గొర్ల ఉమామహేశ్వర రావు వనం అచ్చెన్నాయుడు తుంపాల అప్పారావు కాపు శెట్టి శేషుబాబు జన్మభూమి రెడ్డి శ్రీను శరగడం రాము కర్రి బాబు పల్ల కృష్ణ బి పద్మావతి సబ్బవరపు సత్యనారాయణ బుజ్జి డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



# మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ ఆరోగ్యం మెరుగుపడాలని వైసీపీ నాయకులు పూజలు



భీమునిపట్నం : శనివారం భీమిలి గ్రామదేవత శ్రీ శ్రీశ్రీ నూకాలమ్మ గుడిలో మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ ఆరోగ్యం మెరుగు పడాలి అని భీమిలి జీవీఎంసీ 3 వ వార్డు అభ్యర్థిని మైలపల్లి భారతి షణ్ముఖ రావు భీమిలి వైఎస్సార్సీపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేకప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మైలపల్లి భారతి షణ్ముఖరావు మాట్లాడుతూ కరోనా మహమ్మారి విజృంభిస్తున్న వేళ కూడా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి విశాఖ జిల్లా అంతా కూడా సుడిగాలి పర్యటన చేయడం అనేక మైనటువంటి హాస్పిటల్ సందర్శించి కరోనా రోగులు బాగోగులు తెలుసుకుంటూ అనునిత్యం ప్రజల మధ్య తిరిగి నేడు అనారోగ్యం బారిన పడటం చాలా దురదృష్టకరమని నూకాలమ్మ దీవెనలతో అతి త్వరగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్యకు రావాలని కోరుకుంటున్నట్లు ఆమె తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్ .కరుణాకర్ రెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లిపిల్లి నరసింగ రావు, బీసీ సెల్ అధ్యక్షులు వాసుపల్లి కొండబాబు, మాజీ కౌన్సిలర్లు కదిరి ఎల్లాజీ , మైలపల్లి లక్ష్మణరావు ,కొప్పల రమేష్, నాయకులు భాగం గోపాలరావు, అప్పికొండ అప్పలనాయుడు, గుండాసు మధునాయుడు ,కొంద్రు రామసూరప్పడు, ఆర్. ప్రభాకర్ నాయుడు ,అల్లిపిల్లి అప్రమ్మ , జగ్గారావు, కర్రోతు రమణబాబు, డింగి దుర్గారెడ్డి, మరియు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# 108లోనే ప్రసవం

కొయ్యూరు : కొయ్యూరు మండలలో రెల్లలపాలెం గ్రామానికి చెందిన తాంబెలి రాధ 108 వాహనంలో ప్రసవించింది. ఉదయం పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్ ద్వారా డౌనూరు పిహెచ్‌సికి వెళుతుండగా నొప్పులు ఎక్కువ కావడంతో మర్రిపాలెం సమీపంలో బిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్స్ డ్రైవర్ గొర్లె కాంతారావు, ఆశ కార్యకర్త రాణి ప్రసవం చేయించారు. తల్లి బిడ్డను సురక్షితంగా పిహెచ్‌సికి తరలించారు. గర్భిణీకి సకాలంలో ప్రసవం చేసి బిడ్డ, తల్లిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సురక్షితంగా తీసుకు వెళ్ళడంతో అంబులెన్స్ డ్రైవర్ గొర్లె కాంతారావును, ఆశ కార్యకర్త రాణిను అరకు ఎంపి గొడ్డేటి మాధవి ప్రత్యేకంగా అభినందించారు.



అంబులెన్స్‌లో ప్రసవించిన గర్భిణీ

# విజయభాను సంపాదకీయం

## రైతు గుండెల్లో కొలువు

మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పాస్ అయిన రెవెన్యూ చట్ట సంస్కరణ గురించి మాట్లాడుకోని తీరాలె. ఎందుకంటే కోట్ల మంది జీవితాలతో ముడిపడి ఉన్న ముచ్చట అది.రెవెన్యూలో ఉద్యోగమంటే బంపర్ ఆఫర్‌గా భావిస్తరు. కింది నుంచి పై వరకూ కొందరిని మినహాయించి దోపిడీ విస్తరించి వుంటుంది. రెవెన్యూ విభాగంలో వ్యవసాయ భూములు అనుసంధానం కావడం చాలామందికి పండుగ అయింది.మోసం ఎవరిని చెయ్యవచ్చంటే.. మనకు బాగా తెలిసినవాళ్ళని గానీ.. ఏమీ తెలియని అమాయకులను గానీ. ఇక్కడ ఏమీ తెలియని అమాయకులు, నిరక్షరాస్యులు బక్క రైతులు.

ప్రగత పది పదిహేనేండ్లుగా భూముల ధరలు విపరీతంగా పెరుగుతున్నయ్. రాష్ట్రం వచ్చాక ప్రగతి పట్టాలెక్కిన తరుణంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మరింత మోసాలకు, ప్రాణహానులకు దారితీసే ప్రస్తుత తరుణంలో బిల్లు రావడం ఊరట కలిగించే మంచి పరిణామం. ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప సంకల్పాలలో ఒకటి రెవెన్యూ వ్యవస్థ సంస్కరణ. గతంలో రెవెన్యూను కదిలిస్తే తమ పవర్ ఎక్కడ పడిపోతుందోనని ఆ ఆలోచనకే సాహసించేవాళ్లు కాదు.

చాలాకాలంగా ఈ విషయం మీద కసరత్తు చేస్తున్న ముఖ్యమంత్రి ఏడాది కిందట రెవెన్యూ ప్రక్షాళన అని అనౌన్స్ చెయ్యగానే కొన్ని నిరసనలొచ్చాయి. అయినా, ఆయన బెదరలేదు. కసరత్తు ఆపలేదు. చిత్తశుద్ధికి ధైర్యమెక్కువ కదా..! అదే సమయంలో ఎవరికి తోచిందోగానీ.. నమస్తే తెలంగాణ పత్రికలో 'ధర్మగంట' మోగింది.

నిజంగా అది అధర్మంతో పీడింపబడుతున్న పేదరైతుల పాలిట దేవుడి గంట. ప్రజలనుండి విపరీతమైన స్పందన వచ్చింది. ముఖ్యంగా అవకతవకలతో, అన్యాయంతో అల్లాడుతున్న బక్క రైతులు కాపాడండి నాయనో.. అన్నట్లు భూములకు సంబంధించిన కాగితాలతో బయటకు వచ్చి, జరిగిన అన్యాయాలను పేపరు ద్వారా ప్రభుత్వానికీ ప్రజానీకానికీ చెప్పుకున్నారు. హృదయవిదారకమైన కథనాలు వెలుగు చూశాయి. చదువుతుంటే కడుపు తరుక్కుపోయేది. కండ్లు జలధారలయ్యేవి. రైతులే.. చట్ట సవరణను వ్యతిరేకిస్తూ అరుస్తున్న రెవెన్యూ ఉద్యోగుల నోళ్ళను తమ కథనాలతో మూయించారు. అటునుండి మళ్ళీ అరుపుల్లేవ్. భూమి కడుపున పెట్టుకొని లాలించే అమ్మలాంటిది. తరతరాలుగా ఒకరినుండి ఒకరికి అందే ధైర్యం. రైతుకు ఆ మట్టినీ, ఆ నేలనీ ప్రేమించడం, సాగుచేసి పండించడం, జీవనం సాగించడం తప్ప మరొకటి తెలియదు. అలాంటి భూమిపోతే ఎలా బతుకాల్నో తెలియదు.

రియల్ ఎస్టేట్ పేరుతో దొడ్డిదారిన దొంగలు జొరబడి అధికారులతో కుమ్మక్కై పేపర్లు మార్చి ఇది నీది కాదు మాదంటే.. రైతేం కావాలి. తరాల తరబడి నడిచిన నేల కాళ్ళ కింది నుండి జారిపోతుంటే ఎవరికి చెప్పుకొంటాడు. ఎన్నెన్నో మరణాలకు భూ సమస్యలు కారుణమయ్యాయంటే అతిశయోక్తి కాదు. బడాబాబులు, రౌడీలు పెద్ద పెద్ద కార్లలో వచ్చి భూమి వదిలి వెళ్ళిపొమ్మంటే పాపం ఆ రైతుకు ఎదిరించే శక్తి ఎక్కడిది. కాపాడవలసిన చట్టం కాసులకమ్ముడు పోయినప్పుడు, ఓడిపోయి, మానసికంగా చచ్చిపోయి, వాళ్ళు రాల్చిన చిల్లరను కన్నీళ్ళతో తడుపుకొంటూ తలవంచుకు వెళ్ళిపోవడం తప్ప మార్గంఏది..? భూముల విషయంలో మన తెలంగాణలో ప్రత్యేక పరిస్థితి. రిజిస్ట్రేషన్లు వుండేవి కావు. తెల్లకాగితమే భూమి యాజమాన్య ధ్రువీకరణ పత్రం. పైగా వందల ఎకరాలు ఇనాములుగా రాసి ఇచ్చేవారు. ఇంకా చాలా లొసుగులతో కూడిన వ్యవస్థ అది. అక్రమార్కులకు ఆట విడుపుగా మారడానికి ఇదీ ఒక కారణం. దుర్మార్గుల పదఘట్టనల కింద నలిగి పోయిన జీవితాలెన్నో.. విడిచిన ప్రాణాలెన్నో.

రాష్ట్రవ్యాప్త భూముల సర్వేకు ప్రభుత్వం ఆదేశించడం ఎందరికో ధైర్యాన్నిచ్చింది. స్థలాల రూపంలో, పొలాల రూపంలో ఆస్తులు కొనుక్కున్నవారికి, వాటిని కబ్జాల నుండి కాపాడుకోలేక అవస్థలు పడుతున్నవారికి గొప్ప రిలీఫ్. లొసుగులతో కూడిన రెవెన్యూ చట్టాలతో, స్వార్థపరుల ధనదాహంతో ఎన్నో విలువైన భూములు అన్యాక్రాంతం కావడం మనకు తెలిసిందే. హైదరాబాద్ రోడ్లు ఎంత రక్తంతో తడిచాయో, ఎన్ని హాహాకారాలు విన్నాయో అందరం సాక్షులమే. ఇప్పుడు చాలావరకు తగ్గాయిగానీ బెదిరించి అదిరించి కొన్ని జరుగుతూనే వున్నాయి. మళ్ళీ ఆ పరిస్థితులు రాకుండా చట్టం కఠినతరంగా రూపొందించాలన్నది ప్రజల కోరిక.

## కోవిడ్ చికిత్సకు మొట్టమొదటి ప్రిస్క్రిప్షన్ డ్రగ్‌ను ఆమోదించిన రష్యా!




మాస్కో: కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు రష్యా వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రపంచంలో మొదటి కరోనా వ్యాక్సిన్‌ను రిజిస్టర్ చేసిన ఆ దేశం ఇప్పుడు ఫార్మసీలో అమ్మేందుకుగానూ మొట్టమొదటి ప్రిస్క్రిప్షన్ డ్రగ్‌ను ఆమోదించింది. 'కరోనావిర్'గా పిలిచే ఈ ఔషధాన్ని రష్యాకు చెందిన ఆర్-ఫార్మ్ అభివృద్ధి చేసింది. దీనిని స్వల్ప, మధ్యస్థ లక్షణాలున్న కొవిడ్ రోగులకు చికిత్సలో భాగంగా అందించనున్నారు. ఈ యాంటీ వైరల్ డ్రగ్‌ను వారంలోగా దేశంలోని అన్ని ఫార్మసీలకు పంపిస్తామని ఆ కంపెనీ వెల్లడించింది. 168 మంది రోగులు పాల్గొన్న మూడోదశ క్లినికల్ ట్రయల్స్ తరువాత కరోనావిర్‌కు అనుమతి లభించిందని ఆర్-ఫార్మ్ తెలిపింది. కరోనావిర్ ఆమోదం అవిఫావిర్ అనే డ్రగ్‌కు మార్గం సుగమమం చేసింది. ఈ రెండు ఔషధాలను జపాన్‌లో అభివృద్ధిచేసిన ఫావిపిరవిర్ డ్రగ్ ఆధారంగా తయారుచేశారు. ఇదిలా ఉండగా, కరోనావిర్‌ను ఆమోదించిన రష్యా కరోనా వైరస్ వ్యతిరేక పోరులో ప్రపంచంలోనే లీడ్ తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తున్నది. ఇది ఇప్పటికే చాలా దేశాలకు కొవిడ్ -19 పరీక్షా కిట్‌లను ఎగుమతి చేస్తోంది. అలాగే, స్పుత్నిక్-వీ వ్యాక్సిన్ సరఫరా కోసం అనేక అంతర్జాతీయ ఒప్పందాలను కుదుర్చుకుంది.

## యువీ ఆరు సిక్స్‌లకు 13 ఏళ్లు



ఇంటర్నెట్ డెస్క్: యువరాజ్‌సింగ్ ఆరు సిక్సర్లు క్రికెట్ అభిమానులకు ఎప్పటికీ గుర్తుంటాయి. ఆ వీర బాదుడికి నేటితో 13 ఏళ్లు. మొట్టమొదటి టీ20 ప్రపంచకప్ సందర్భంగా 2007 సెప్టెంబర్ 19న ఇంగ్లాండ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో యువీ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. స్టువర్ట్ బ్రాడ్ వేసిన 19వ ఓవర్‌లో 6 సిక్సర్లు దంచేసి చరిత్ర సృష్టించాడు. ఆ సందర్భాన్ని భారత మాజీ ఆల్‌రౌండర్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నేడు గుర్తుచేసుకున్నాడు. ఆ మ్యాచ్‌లోని ఓ స్టిల్‌ను పంచుకుంటూ 'సమయం ఎంత వేగంగా పరుగెడుతోందో' అంటూ క్యాప్షన్ పెట్టాడు. కాగా యువీ పోస్టుపై బ్రాడ్ ఫన్నీగా స్పందించాడు. 'ఈ సమయం కంటే ఆరోజు బంతే వేగంగా పరుగెట్టింది' అంటూ రిప్లై ఇచ్చాడు. యువీ పోస్టుపై గౌతమ్ గంభీర్ సైతం సరదా వ్యాఖ్యానించారు. ఓ హిందీ సినిమాలోని డైలాగ్‌ను గుర్తుచేస్తూ 'ఈ రికార్డు నాకు ఇచ్చెయ్' అని అన్నాడు. వెస్టిండీస్ దిగ్గజం క్రిస్‌గేల్ లెజండరీ అంటూ కొనియాడాడు. డర్బన్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియాకు ఓపెనర్లు వీరేంద్ర సెహ్వాగ్-గౌతమ్ గంభీర్ అర్ధ శతకాలు సాధించి శుభారంభం అందించారు. అనంతరం క్రీజులోకి వెళ్లిన యువరాజ్‌సింగ్ ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లతో చెలరేగాడు. కేవలం 16 బంతుల్లో 58 పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

## ఘనంగా ఐటీసీ సన్ ఫీస్ట్ వార్షికోత్సవ వేడుకలు

విశాఖపట్నం : ఐటీసీ సన్ ఫీస్ట్ యప్పీ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సంస్థ కార్యాలయంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ ఫుడ్ డివిజన్ హెడ్ హేమంత్ మాట్లాడుతూ యప్పీనూడుల్ వేడుకల్లో భాగంగా 2894 నూడుల్ ప్రేమికులంతా కలిసికట్టుగా ఒకేసారి తమకిష్టమైన నూడల్స్ తింటూ ఫొటోలు తీసుకుని గంట వ్యవధిలో ఫేస్ బుక్ లో అప్లోడ్ చేసి చరిత్ర సృష్టించారన్నారు. గంట వ్యవధిలో అత్యధికంగా ఫొటోలు అప్లోడ్ చేసిన దానికి ఇందులో పాల్గొన్న ప్రతిఒక్కరికీ గిన్నిస్ వరల్డ్ రికార్డు నుంచి అధికారికంగా పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందుతుందన్నారు. దీంతో పాటు సఫీస్ట్ యప్పీ నుంచి కూడా పత్రం చేరుతుందని చెప్పారు. ఈ కార్య క్రమంలో నగరవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంతాడ పంచాయతీలో రైతుభరోసా కేంద్రానికి భూమి పూజ


శంకుస్థాపనలు చేస్తున్న దృశ్యం

కొయ్యూరు : అంతాడ పంచాయతీలో శనివారం రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అంతాడ వైసిపి నాయకులు సుర్ల చంద్రరావు, కూడా బాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలతో అభివృద్ధి కార్యక్రమాలు కూడా అమలు చేస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో నాయకులు కూడా ధర్మరాజు, ఉల్లి తరుణ్, కూడా లక్ష్మణరావు, సాలేబు లక్ష్మణరావు, ఉల్లి శ్రీనివాస్, వాలంటీర్ పాంగి కన్నబాబు, కొర్రు వీర్రాజు, కూడా నాగమణి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బీజేపీ నేతలు మొక్కలు పంపిణీ



గొలుగొండ : ప్రధాని మోదీ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా శనివారం గొలుగొండ మండలం గ్రామంలో బిజెపి నాయకులు గాదె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కల పంపిణీ చేశారు. అనంతరం కొత్త జోగంపేట చెరువుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గొలుగొండ గణేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కవి సమయం

### కర్తవ్య పాలన

కర్తవ్యోన్ముఖులను గావించునది
ఋణమార్గంలో నడిపిస్తూ
గమ్యానికి చేర్చునది
అరిషడ్వర్గాలను లోబరుచుకొని
కోరికల గుర్రాలకు పగ్గాలు వేసి
శాంతి, అహింస, కరుణ, ప్రేమ
దైవిక గుణాలను అలవర్చునది
భక్తి కరదీపిక భగవద్గీత
ఇష్టదేవతా సాక్షాత్కార మొనరించునది
భక్తి, జ్ఞాన,యోగ మార్గములలో
జీవితానికి దివ్యత్వం ఒసంగునది
స్వస్వరూప సాక్షాత్కారం ప్రసాదించునది
సకల మానవాళికి కర్తవ్య పాలన దిశగా
నడిపించు దివ్య, పవిత్ర గ్రంథం భగవద్గీత

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : అధిక ఆశ్వయుజ ; తిథి: తదియ ఉ.10.07; చిత్ర ఉ. 6.20 స్వాతి తె. 4.41 ప.వ. 11.32ల 1.01

ఆదివారం 20-09-2020

**మేషం** : శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం.మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కార మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంత మంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అను కూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతు లకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి

## లక్ష్మీదేవిని పూజిస్తే.. శుక్ర గ్రహ దోషాలు తొలగిపోతాయట!



### సంకీర్తన

జీవితంలో కొన్ని సమస్యలకు పరిష్కారాలు వేరే కావచ్చు. అయితే మరికొన్ని సమస్యలకు అవసరాలకు డబ్బే ప్రధానం. ధనానికి ఇబ్బందులు, ఆర్థిక సమస్యలు, దారిద్ర్యంతో కష్టాలు అనుభవిస్తుంటే.. ఇక ఆలోచించ కుండా శుక్రవారం మహాలక్ష్మీదేవిని పూజించాల్సిందే.

ఆ తల్లి కటాక్షం కావాలంటే అంకిత భావంతో కూడిన పూజాభిషేకాలు జరప వలసి వుంటుంది.
శుక్రవారం రోజున భక్తిశ్రద్ధలతో సేవించవలసి వుంటుంది.
అందువలన అమ్మవారు ప్రీతి చెందుతుందనీ, ఫలితంగా దారిద్ర్యం తొలగిపోయి సంపదలు ప్రసాదించ బడతాయని పురో హితులు అంటున్నారు. అంతేకాదు అమ్మవారిని అర్చించడం వలన శుక్ర గ్రహ సంబంధమైన దోషాలు కూడా తొలగిపోతాయని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి.

అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తి కాకపోవడం, అవమానాలు ఎదురు కావడం, అనారోగ్యం వంటివి శుక్రగ్రహ దోషంతో ఏర్పడుతాయి.
అందుచేత శుక్రగ్రహ దోషాలను తొలగించుకోవాలంటే..
లక్ష్మీపూజ తప్పనిసరి అని పండితులు అంటున్నారు. అందుచేత శుక్రవారం రోజున ఉపవాస దీక్షను చేపట్టి, అమ్మవారి ఆలయంలో...



ప్రదక్షిణలు చేయడం వలన ... పూజాభిషేకాలు జరపించడం వలన ఆశించిన ఫలితం లభిస్తుందని వారు సూచిస్తున్నారు.

# ఘనంగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్కి శనివారం ప్రాకారసేవ ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటలకు శ్రీ స్వామి,అమ్మవార్లను ప్రాధాన రాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చి సర్వాంగ సుందరంగా తిర్చి దిద్దిన వెండి తిరుచ్చిపై ఆశీనులు గావించి భక్తుల గోవింద నామస్మరణాలు, మేళ, తాళాలు సడుమ శ్రీ స్వామి,అమ్మవార్లను ముమ్మారు ప్రాధాన రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు.

ఈ కార్యక్రమంలో ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పెండ్యాల. భాస్కరరావు భక్తులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వారోత్సవాలు భాగంగా 6వ రోజు
# మాస్కులు పంపిణీ



భీమునిపట్నం : భారతీయ జనతాపార్టీ భీమిలి డివిజన్ అధ్యక్షు డు లయన్ డాక్టర్ సత్తరవు వాయునందనరావు ఆధ్వ ర్యంలో శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సంద ర్భంగా వారోత్సవాలు భాగంగా 6వ రోజు మాస్కులు మరియు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమం లో రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కె. ప్రశాంతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరాడ శంకర్‌రావు నగర ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు కోడూరు సంజీవరావు, 2 వార్డు ఉమ్మడి అభ్యర్థి గనివాడ. పార్వతి నాయకులు యన్. జనార్దన్ రావు , రాజ్ పురోహిత్ కుమార్, ముమ్మడిశెట్టి సునీల్, పి.రాజేంద్రప్రసాద్, పి.భరత్‌కుమార్, కె.రాజారావు, రవితేజ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరుగుచున్న వరుస దాడులకు నిరసనగా
# టీడీపీ ఆధ్వర్యంలో నిరసన జ్వాలలు




అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరంలో ఇటీవల రాష్ట్రంలో హిందూ దేవాలయాలపైనా,ధార్మిక సంస్థలపైనా వరుసగా జరుగుతున్నటువంటి దాడులకు నిరసనగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు శనివారం సాయంత్రం తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఇంచార్జి లు యనమల కృష్ణుడు మరియు వరుపుల రాజా ఆధ్వర్యంలో శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి తొలిపావంచాల వద్ద పార్టీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ లో హిందూ దేవాలయాలపై ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని,జరిగిన సంఘటనలకు కారకులైన వారిని శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యనమల. కృష్ణుడు,వరుపుల.రాజా, కొమ్ముల.కన్నబాబు,వెన్న.శివ, రాజాల. చిట్టిబాబు, సరమర్ల. మధుబాబు,మెరపల. నర్సయ్య, బండారు.సురేష్, రాయి. శ్రీనివాసరావు,పాలం. చిన్న మరియు తొండంగి మండల నాయకులు కోడా. వెంకటరమణ,ఎమ్. సత్యనారాయణ,కొయ్య. కేశవ, ఇనకోటి. వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



విశాఖ సూర్యాబాగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు, కమ్యూనిస్ట్ నాయకుడు స్వర్గీయ కామ్రేడ్ పావెళ్(వానపల్లి అప్పలరాజు) పెద్దకర్మ పురస్కరించుకుని శనివారం నిరుపేదలకు అన్నదానం చేశారు.
ఈ కార్యక్రమంలో సాయి పూజా ఫౌండేషన్ ఛైర్మన్, మాజీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్, ఉదయ్ , బాబు, బుజ్జి, వెంకటేష్, రవి, వాసు, శ్యామ్, సత్యరాజు, సుందర్, కోటి, రాజు, రమేష్ మకు, నూకరాజు, శ్రీను మకు, శ్రీను ఆటో, అనకాపల్లి రాజు, సన్నీ, మధు, చిన్న అనకాపల్లి, లక్కీ, ఎల్లాజీ, ఈశ్వరరావు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

# సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు
## - ఎస్‌హెచ్‌పిఐవి మండల అధ్యక్షులు రమణ



దేవరాపల్లి : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు సంక్షేమ పథకాలు పట్ల అవగాహన కల్పించనున్నట్లు సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక మండల అధ్యక్షులు కె వి. రమణ తెలిపారు. ముందుగా సెప్టెంబర్ 21 నుంచి సచివాలయం కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ మేరకు మండల పరిషత్ అధికారులకు శనివారం సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక ప్రతినిధులు అనుమతి కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అక్టోబర్ నుంచి గ్రామసభల నిర్వహణ, గ్రామ సభలపై సచివాలయ కార్యదర్శులకు అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో కరోనా కారణంగా ఏప్రిల్, జూలై మాసాల్లో జరగవలసిన గ్రామసభలు నిర్వహణ జరగలేదన్నారు.

ఇరవై ఒకటి సెప్టెంబర్ నెల నుంచి మారిన పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం వారి ఆదేశాలకు అనుగుణంగా వంద మందికి మించకుండా సభలకు, సమావేశాలకు అనుమతి ఉన్నందున ఎంపీడీఓ ఆదేశాలు జారీ చేసి అక్టోబర్ లో గ్రామ

సభలు నిర్వహణకు సహకరించాలని కోరారు. సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక ఆధ్వర్యంలో శిక్షితులైన అనుభవం గల జిల్లా ప్రతినిధులు చేత గ్రామసభల నిర్వహణ పై అవగాహన కల్పించుటకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వేచలపు అప్పలనాయుడు, వఱ్ఱు కుల అప్పారావు, వైసీపీ యూత్ నాయకులు కొరుప్రోలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శనివారం 27వవార్డు వైయస్ఆర్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి మరియు అధ్యక్షులు నీలాపు సర్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో దొండపర్తి గ్రామ దేవత అయిన ఏరుకుమాంబ ఆలయంలో మన అందరి ప్రియతమ నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్ ఆరోగ్యం బాగు అవ్వాలని ప్రత్యేక పూజలు జరిపించడం జరిగింది.

# 33వరోజు జీజీహెచ్ శానిటేషన్ వర్కర్స్ ఆందోళన
## - కార్మికుల డిమాండ్స్ పరిష్కారం కోసం ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం
## సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్




కాకినాడ : కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ ఆందోళన 33వ రోజు కొనసాగించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా శానిటేషన్ వర్కర్స్ ఎన్నో వ్యయప్రయాసలు తట్టుకుని సేవలు అందించారని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు రక్షణకు జీజీహెచ్ చాలా కీలకమైన ఆసుపత్రి అని,అయితే శానిటేషన్ వర్కర్స్ లేకుండా వైద్యం చేయడం సాధ్యమా అని ప్రశ్నించారు.నెలల తరబడి పోరాడుతున్న అధికారుల స్పందనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నామన్నారు.కార్మికులను కాంట్రాక్టర్ చర్చలకు పిలవడం ఆహ్వానిస్తున్నామని, తాత్సారం చేస్తే సిఐటియు అనుబంధ కార్మిక సంఘాలతో ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం అవుతామన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు రూ.16వేలు జీతం అమలు చేయాలని, రక్షణ సౌకర్యాలు, ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. ఆదివారం ఉదయం కాంట్రాక్టర్స్‌తో చర్చలు జరుగబోతున్నాయని యూనియన్ అధ్యక్షుడు సిహెచ్. విజయ్ కుమార్ తెలిపారు.న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.

లేని పక్షంలో ఆందోళన సమ్మె గా మారుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు,యూనియన్ నాయకులు కళ్యాణ్, జె.శేషు, ఆర్.రమేష్, లక్ష్మీ ప్రియ,కృష్ణ వేణి, తలుపులమ్మ, పుష్ప, కుమారి, దుర్గ,భాగ్యవతి, సత్యవతి, వాసు, దుర్గా ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు
## - స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కలవల మరియమ్మ గాంధీ



కాకినాడ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఉపాధి హామీ పథకం స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కలవల మరియమ్మ గాంధీ అన్నారు.అమరావతిలోని తాడేపల్లిలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ఉపాధి హామీ పథక స్టేట్ కౌన్సిల్ మెంబర్ల సమావేశం పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రావు రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా తరపున స్టేట్ కౌన్సిల్ మెంబర్ కలవల మరియమ్మ గాంధీ హాజరై జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం అమలు, తీరుతెన్నులపై మంత్రికి వివరించారు. జిల్లాలో ఉపాధి హామీ పనులు కరోనాలో సైతం జోరుగానే సాగుతున్నాయని, కూలీలకు వేతనాలు ఎప్పటికప్పుడు అందిస్తూ జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. అయితే జిల్లాలో డ్వామా పిడి, ఇద్దరు ఏపీడిల పోస్టులు ఖాళీగా ఉండటంతో అభివృద్ధి పనులు కుంటు పడుతున్నాయని వివరించారు. అలాగే జిల్లాలో గుర్రపు డెక్కలు పెరిగిపోవడంతో రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గత ప్రభుత్వ హయాంలో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమం నిలుపుదల చేశారని అన్నారు. ప్రస్తుతం ఆ పనులకు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే మొక్కల పెంపకం పథకంలో రైతులకు తొలి ఏడాది మాత్రమే బిల్లు ఇచ్చి తరువాత రెండు సంవత్సరాలు ఇవ్వకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారని వివరించారు. దీనిపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పందించి మాట్లాడుతూ వచ్చే బడ్జెట్ లో గుర్రపు డెక్కల తొలగింపు పనులకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మొక్కల పెంపకంలో రైతులకు ఇవ్వాల్సిన నిధులను ఈ ఏడాది నుండి సక్రమంగా విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులను వారం లోపు భర్తీ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అంతేకాకుండా జిల్లాలో అత్యధికంగా జాబ్ కార్డులు ఇవ్వడం పట్ల జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కలవల మరియమ్మ గాంధీని మంత్రి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ గోపాలకృష్ణ ద్వివేది, కమిషనర్ గిరిజా శంకర్, డైరెక్టర్ చిన్న తాతయ్య, వాటర్ షెడ్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ లు పాల్గొన్నారు.

# సచివాలయ పరీక్షల ఏర్పాట్లను పరిశీలించిన జేసీ



శ్రీకాకుళం : నేటి నుండి జిల్లాలో జరగనున్న గ్రామ, వార్డు సచివాలయ పోస్టుల నియామక పరీక్షల ఏర్పాట్లను సంయుక్త కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ లో ఏర్పాటుచేసిన సచివాలయ పరీక్షల మెటీరియల్ స్టాక్ పాయింట్ ను జె.సి శనివారం మధ్యాహ్నం సందర్శించారు. అనంతరం మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. తొలుత మండలాల వారీగా సచివాలయ పరీక్షల మెటీరియల్ పంపిణీ వివరాలను జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.చక్రధర రావుని అడిగి తెలుసు కున్న ఆయన మెటీరియల్ తీసుకున్న రూట్ అధికారులకు జె.సి పలు సూచనలు చేశారు. మెటీరియల్ ఉన్న వాహనాలు ఎక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని, ఇందుకు రూటు అధికారులు బాధ్యత వహించాలని అన్నారు. ఒక్కో మండలానికి ఒక్కో కోడ్ కేటాయించడం జరిగిందని, తమకు కేటాయించిన మెటీరియల్ సరిపోయినది లేనిదీ పరిశీలించుకోవలసిన బాధ్యత కూడా రూట్ అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జి.చక్రధరరావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, ఏ.కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి చొరవతో
# డ్రైనేజీ సమస్య పరిష్కారం

భీమునిపట్నం : జీ వి ఎం సి భీమిలి జోన్ 2వ వార్డులో దెక్కతి పాలెం గ్రామంలో గత 20 సం॥రాల నుండి ఉన్నటువంటి డ్రైనేజీ సమస్య రాష్ట్ర మంత్రి అవంతి శ్రీనివాస్ చొరవతో డ్రైనేజీ సమస్య. పరిష్కారం కోసం అధికారులతో, అటు రాజకీయ నాయకులుకు ఎన్ని సార్లు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయింది. చివరికి ఈ సమస్య శిల్లా సరళ రాణి కరుణాకర్ రెడ్డి దృష్టి కి రావడంతో వెంటనే రాష్ట్ర మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాస్ తీసుకెళ్లడం జరిగింది. ఆయన వెంటనే స్పందించి ఈ సమస్య పరిష్కారం చేసి తక్షణమే పది లక్షల రూపాయలు గ్రాంట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సరళ రాణి ఆధ్వర్యంలో అధికారికంగా పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిల్ల భాస్కర్ రెడ్డి, కొప్పల రమేష్, చిప్పాడ వెంకటేష్, గుండాసి మధు నాయుడు, కె కె రెడ్డి, బూర శ్రీను, కర్రి బుజ్జి, గండిబోయిన వెంకట్రావు, గండిబోయిన దుర్గ రావు సరగడ నాగి రెడ్డి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం



శ్రీకాకుళం : కౌన్సిల్ హాలు నందు కమిషనర్ శ్రీకాకుళం నగరపాలక సంస్థ లో గల అన్ని ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయుట జరిగినది. సమావేశము లోని అంశములు : 1) పాఠశాల విద్యా సంచాలకులు మరియు పురపాలక పరిపాలనా శాఖ కమిషనర్ మరియు సంచాలకులు వారి ఆదేశముల మేరకు తేది 21.09.2020 నుండి పాఠశాలలకు ఉపాధ్యాయులందరూ హాజరు కావలసినదిగా ఆదేశించియున్నారు 2) 9వ తరగతి మరియు 10 వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు తమ తల్లి దండ్రుల అంగీకారముతో పాఠశాలలకు వచ్చి వారికి ఏర్పడిన సందేహములను సంబంధిత ఉపాధ్యాయులు వారి సందేహములను తీర్చి తిరిగి వారిని పంపించవలెను. 3) ప్రతీరోజు ఉపాధ్యాయులందరూ తమ తమ పరిధిలో గల ప్రాంతాలలో ఇంటింటికి ప్రచారం చేస్తూ ఎక్కువ సంఖ్యలో కొత్తగా విద్యార్థులను పాఠశాలలలో చేర్పించుటకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా ఆదేశించియున్నారు. 4) 1వ తరగతి నుండి 8వ తరగతి విద్యార్థినీ విద్యార్థులతో వారి వారి తరగతి ఉపాధ్యాయులు వాట్సప్ గ్రూప్ ఏర్పరచి వారికి ఆన్లైన్ తరగతులు మరియు టి.వి పాఠాల బోధన విద్యార్థిని విద్యార్థులందరూ సక్రమముగా అర్థం చేసుకుంటున్నారో లేదో ఉపాధ్యాయులు గమనించి వారి సందేహములు నివృత్తి చేసి వారికి ప్రతీ రోజు హోం వర్క్ ఇచ్చి అది సక్రమముగా జరిగేటట్టు చూడవలసినదిగా ఉపాధ్యాయులను ఆదేశించియున్నారు. 5) ప్రతీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోవిడ్ - 19 జాగ్రత్తలు పాటిస్తూ మాస్కు ధరిస్తూ, వ్యక్తిగత పరిశుభ్రత, శానిటైజర్లు, సామాజిక దూరం పాటిస్తూ ఉపాధ్యాయులందరూ తగు జాగ్రత్తలు తీసుకోవలసినదిగాఆదేశించియున్నారు.

6) ఉపాధ్యాయులందరూ సమయ పాలన పాటిస్తూ విధులలో ఎటువంటి అలసత్వము వహించినచో అటువంటి వారిపై తగు క్రమశిక్షణా చర్యలు తీసుకోబడునని తెలియ జేసియున్నారు.

# నాడు-నేడు నిధుల్లో అవకతవకలపై నిలదీసిన చైర్మన్

నాతవరం : నాతవరం మండలం మర్రిపాలెం కస్తూర్బా పాఠశాలలో నాడు- నేడు నిధుల అవకతవకలపై చైర్మన్ పైల వెంకటరమణమ్మ అధికారులను నిలదీశారు. ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఈ పాఠశాల అభివృద్ధికై 42 లక్షల నిధులు మంజూరు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుతో పాటు సంబంధిత అధికారులు కుమ్మక్కై ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు చేసి తమ ఇష్టారాజ్యంగా బిల్లులు పెట్టి చేత దొంగ సంతకాలు చేస్తున్నారని రమణమ్మ బహిరంగంగా విమర్శిస్తున్నారు.ఇదేమిటని నిలదీస్తే నన్ను చైర్మన్ పదవి నుంచి తొలగించాలని ప్రయత్నించారని చైర్మన్ తమ యొక్క ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ అన్న ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ నాడు- నేడు పాఠశాల అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేసి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడాలని రమణమ్మ అన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ వెంకటరమణమ్మ

# ఎమ్మెల్యే గణేష్ ఆదేశాలతో తాత్కాలిక రోడ్డు నిర్మాణం



గొలుగొండ : గొలుగొండ మండలం ఎర్రవరం రాజబాబు గుడి వద్ద నుంచి నల్లంకి కంఠవరం అప్పన్నపాలెం అడ్డలోవ గిరిజన గ్రామాల్లో...

నాలుగు రోజుల కింద పడిన వర్షాలకు బ్రిడ్జి పోవడంతో గిరిజన గ్రామస్తులు కోరిక మేరకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిలిచిపోయిన మార్గాన్ని ఎమ్మెల్యే ఆదేశాలతో తాత్కాలికంగా రోడ్డు మార్గాన్ని పున్నరుద్ధరించడం జరిగింది.

నాయకుల దృష్టికి తీసుకువెళ్లి 48 గంటల్లో సమస్య పరిష్కారానికి చొరవ చూసిన ఎమ్మెల్యేకు, స్థానిక నాయకులకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వార్డు ఆర్‌పిలు నా తోబుట్టువులతో సమానం



పూర్ణామార్కెట్ : వైయస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళా అక్కచెల్లెమ్మలకు 11-9-2020న రుణమాఫీ అయినా శుభ సందర్భముగా

వార్డులో వారం రోజులు వారోత్సవాలు ఘన విజయంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 35వవార్డు అధ్యక్షులు, కార్పొరేటర్ అభ్యర్థి అలుపన కనకరెడ్డి ఆధ్వర్యంలో జరిగినవి. ఈ ఘన విజయానికి సహకరించిన వార్డు సిడివో కి అలుపన కనకరెడ్డి గౌరవంగా సన్మానం చేసి స్వీట్ అందచేయడం జరిగింది.

అలాగే ఈ కార్యక్రమంలో...

ముఖ్య పాత్ర పోషించిన ఆర్‌పిలను, అక్కా చెల్లెమ్మలుగా భావించి వాళ్లకి పసుపు కుంకుమ భరిణి, చీరా జాకెట్, మాస్క్, శానిటైజర్, స్వీట్స్ ఇచ్చి వాళ్లని కనక రెడ్డి గౌరవంగా శాలువతో సన్మానించి సత్కరించడం జరిగింది.

# బిన్నిసామ్ కు మేనేజ్మెంట్ స్టడీలో డాక్టరేట్



ఏయూ : ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మరియు మేనేజ్ మెంట్ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థిని బిన్నిసామ్, గౌరవ నీయులైన ఆచార్య బి. మురళీ కృష్ణ గారు మరియు గౌరవనీయులైన ఆచార్య యన్. సాంబశివరావు గారి పర్యవేక్షణలో, "వర్క్ - లైఫ్ బేలన్స్ అండ్ ఇట్స్ ఇంపెక్ట్ ఆన్ జాబ్ సేటిస్ ఫేక్షన్. - ఎ కం పేరిటివ్ స్టడీ ఆన్ ఉమన్ టీచర్స్ వర్కింగ్ ఇన్ సెలక్టెడ్ పబ్లిక్ మరియు ప్రెయివేట్ ప్రొఫెషనల్ కాలేజస్ ఆఫ్ నార్దర్న్ కోస్టల్ ఆంధ్రప్రదేశ్." అనే అంశంపై పరిశోధ నలు జరిపారు. బిన్నిసామ్ ప్రస్తుతము అళ్వార్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ కంప్యూటర్స్, కొత్త గాజువాక సంస్థలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈమె శ్రీ కె.సి. మేథ్యూ మరియు శ్రీమతి జె. మేథ్యూ దంపతుల యొక్క కుమార్తె. వారు భోపాల్ (మధ్యప్రదేశ్) నివాసులు. ఈమె భర్త సామ్ పి.జాన్ విశాఖపట్నంలో బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ లో సైంటిఫిక్ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. బిన్నిసామ్ పరిశోధనలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీని ప్రధా నము చేసినది. ఈ విభాగంలో గౌరవనీయులైన ఆచార్యులు, నాన్ టీచింగ్ స్టేఫ్, పరిశోధకులు మరియు మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.

# ములగాడ మండలం తహశీల్దార్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన బి.వి.రమణి



గాజువాక : విశాఖ జిల్లా అర్బన్ ములగాడ మండలం తహశీల్దార్ గా బి. వి. రమణి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు తహసీల్దార్ గా కొనసాగిన రామమణి వేరే మండలానికి బదిలీ అయ్యారు. దీంతో ఈ మండలానికి కలెక్టరేట్ లో ఇ సెక్షన్ లో విధులు నిర్వహిస్తున్న బి. వి. రమణి తహశీల్దార్ గా నియామకం చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

శనివారం భాద్యతలు స్వీకరించిన రమణి కి సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్చాన్నిచి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా నూతన భాద్యతలు స్వీకరించిన తహశీల్దార్ రమణి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారిగా పారదర్శకంగా వ్యవహరిస్తాను అని అన్నారు. ముఖ్యంగా అవినీతి, అక్రమాలకు తావి లేకుండా మండల ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహశీల్దార్, ఆర్.ఐ. రాజేశ్వరి, వి ఆర్ ఓ వరలక్ష్మి, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# పోషణ మాసోత్సవాలలో భాగంగా 'మురిపాల కన్నా, ముర్రుపాలు మిన్న'

విశాఖపట్నం : పోషణ మాసోత్సవాలలో భాగంగా అర్బన్-2 ప్రాజెక్టు, మద్దిల పాలెం సెక్టార్‌లో గల కెఆర్ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో కెఎల్‌ఆర్‌కె. కుమారి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ ఆర్.రాజ్య లక్ష్మి ఆధ్వర్యంలో 'పోషణ మాసోత్సవాలు'లో భాగంగా శనివారం గృహ సందర్శన చేసి మురి పాల కన్నా, ముర్రుపాలు మిన్న' అనే భావం తల్లులలో కలుగ జేయడం జరిగింది. ఈ కార్య క్రమంలో మహిళా పోలీస్ సిహెచ్. అలేఖ్య, ఎఎన్ఎం సత్యవేణి, ఆశవా పద్మ తదితరులు పాల్గొన్నారు.



# నిర్మాణపు పనులు జాప్యం చేస్తే చర్యలు : కలెక్టర్ మురళీధర్ రెడ్డి

కాకినాడ : జిల్లాలో వివిధ గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్ వాడీ,హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణపు పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని కలక్టర్ మురళీధర్ రెడ్డి ఆదేశించారు.విధాన గౌతమీ హాలులో జిల్లాలోని పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లతో ప్రభుత్వ భవనాల నిర్మాణపు పనులపై సమీక్షించారు.సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలు చూపి నిర్మాణపు పనులను జాప్యం చేస్తే అలాంటి ఇంజనీర్లపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.సమస్య ఏమైనా ఉంటేపై స్థాయిలో చర్చించి, పనులు వేగవంతం చేయాలన్నారు.అక్టోబర్ 2నాటికి ప్రతీమండలంలో ఒక గ్రామ సచివాలయం, అంగన్ వాడీ కేంద్రం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా భవనాలు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

# విద్యుత్‌షాక్ తో లారీ డ్రైవర్ మృతి





మృతుడి ఫైల్ ఫోటో

అనకాపల్లి : విద్యుత్ షాక్‌తో స్టోన్ క్రషర్ లో ట్రిప్పర్ డ్రైవర్ మృతి చెందాడు. గ్రామీణ ఎస్సై పి. రామకృష్ణ రావు చెప్పిన వివరాలు ప్రకారం... విక్రపు శ్రీను (35) అనకాపల్లి మండలం మాకవరం గ్రామం లో నివసిస్తూ స్థానిక రాక్ లైన్ క్వారీ లో గత 8 సంవత్సరం లు ట్రిప్పర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ట్రిప్పర్ ను క్వారీలో ఒక పక్కకు పెట్టి లిఫ్ట్ ఆన్ చేయడంతో ప్రమాదవశాత్తు లిఫ్ట్ హై టెన్షన్ వైర్లు కు తగలడం తో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే ట్రిప్పర్ ను ఆనుకొని మృతి చెందాడు. మృతునికి భార్య మహాలక్ష్మి ,ఇద్దరు ఆడపిల్లలు సింధు(10),దీపిక(11) వున్నారు. శ్రీను మరణంతో భార్య ,కుటుంబ సభ్యులు రోదనలు వర్ణనాతీతం. శ్రీను కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు మృతదేహం వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లి సూరిబాబు సంఘటన స్థలానికి చేరుకుని స్టోన్ క్రషర్ యాజమాన్యంతో మాట్లాడి మృతుని కుటుంబానికి న్యాయం చేశారు. శాసనసభ్యులు అమర్నాథ్ దృష్టికి శ్రీను కుటుంబం గురించి తెలియజేసి ప్రభుత్వం ద్వారా వారికి సహాయం అందేలా కృషి చేస్తానని ఆయన చెప్పారు.

పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వంద పడకల ఆసుపత్రి కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జనసేనలో పలువురి చేరిక



భీమునిపట్నం : శనివారం. పవన్ కల్యాణ్ ఆశయాలు నచ్చి జనసేన పార్టీలో చేరిన మహిళలు మరియు యువత. కీ బీ.వీ.కృష్ణయ్య, వీరమహిళ పరిమి భువనేశ్వరి కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా డా సందీప్ పంచకర్ల మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం మరియు రేపటి తరం యువత భవిష్యత్ కోసం జనసేన పార్టీ నిరంతరం కృషి చేస్తుంది అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తగరపువలస జనసేన పార్టీ నాయకులు. తాత దియేటర్ రవి, సతీష్, వంశీ, కిరణ్, గోపీ, రాజు, రోహిత్, సాయ, కే సతీష్ మరియు జనసైనికులు పాల్గొన్నారు.

# కిష్ణారం గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం



స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు : ప్రధాని నరేంద్రమోదీ 70వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సేవా సప్తావహంలో భాగంగా 6వ రోజు ఆడాకుల పంచాయతీ కిష్ణారం గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం బిజెపి మండలాధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు, జెడ్పీటీసీ అభ్యర్థి కూడా నూకరాజు, ఎంపిటిసి అభ్యర్థులు మచ్చల మంగతల్లి, దూరి సత్యవతి కార్యకర్తలు భీమయ్యమ్మ, గడుతూరి గోవింగ్, రొంగలి వేణుబాబు, బండారు సత్తిబాబు పాల్గొన్నారు.

# ఘనంగా ఏషియన్ బిజినెస్ సమ్మెట్

## నోవోటెల్ వేదికగా రాష్ట్రంలోని పలు రంగాలకు చెందిన వారికి అవార్డులు ప్రధానం






విశాఖపట్నం: వేదిక -వేడుకయ్యింది.. సంబరాలు -అంబరానంటాయ్ .. వెరసి నోవెటల్ హెూటల్ లో దీపపుకాంతులతో అటు ఆహుతులను, విశిష్ట అతిధుల మధ్య ఒక మరపురాని మధురానిభూతిని సొంతం చేసుకొని... ప్రతీ ఏటా ఏషియన్ బిజినెస్ ఎక్ససే లెన్సు అవార్డ్స్ ప్రధానోత్సవమ్ 2020 విశాఖ మహానగరంలో జరగడం అద్భుతం. ఏషియన్ బిజినెస్ కాన్ఫిడరేషన్, సన్ మీడియా గ్రూప్ సీఈఓ స్వామి గంటా ఆధ్వర్యంలో ఏషియన్ బిజినెస్ సమ్మెట్ నిర్వహించారు.

ఈ అవార్డులు పల్సు రంగాలకు చెందిన ప్రముఖులకు అందజేయడం మరో విశిష్టం, అందులోను వివిధ రంగాలకు చెందిన అత్యుత్తమ విశిష్ట అతిధులుగా సైంటిస్ట్ వి. వి. ఎస్. రవికుమార్, సెంచురీయన్ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య జి. ఎస్. ఎన్. రాజు , రిటైర్డ్ ఎస్. పి. కె. రాజ శిఖామణి, అంతర్జాతీయ బ్యాడ్ మెంటేన్ క్రీడాకారిణి పి. ఉషశ్రీ , వైస్సార్సీపీ నగర అధ్యక్షులు, ఎస్ వి కే గ్రూప్స్ అధినేత వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథులు పలువురు మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో సక్సెస్ సాధించాలంటే కృషి, పట్టుదలతోపాటు , నిరంతరం సామాజిక బాధ్యత కలిగి ఉండాలని పిలుపునిచ్చార.

కరోనా కష్టకాలంలో కాస్తంత ఊరట కలిగిస్తూ ఈ అవార్డులను ప్రధానం చేయడం సీఈఓ స్వామి గంటా కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉత్తమ ప్రత్యేక అవార్డులను డాన్స్ అండ్ కల్చరల్ కేటగిరిలో నర్తనశాల డాన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ రాధికా రాణి భేరి, ఉత్తమ ఉపాధ్యాయ కేటగిరిలో డాక్టర్ భగ్గం బ్రహ్మానంద రావు, ఈకో ఫ్రెండ్లీ బిజినెస్ కేటగిరిలో బి శివాజీ రాజు, జర్నలిజం అండ్ సోషల్ వర్కర్ గంట్ల శ్రీనుబాబు, బిజినెస్ అండ్ ఫిల్మ్ ప్రొడ్యూసర్ కేటగిరిలో ఆశా మల్లికా చౌదరి, బిజినెస్ పర్సనాలిటీ పిన్నింటి ఎల్లం నాయుడు, ఉమెన్ ఎంటర్ ట్రైనర్ హైమా మాధవి. కె, ఆర్టిస్ట్ మిస్ ఎబిలిటీ స్వప్న కొవ్వాడ, ఉత్తమ వ్యాపారవేత్త డి కృష్ణ ప్రసాద్, ఇన్ఫ్రా ఎండ్ ఇంటీరియర్స్ అనిల్ కుమార్ నాయుడు సుంకర, మిరాకిల్ బిల్డర్స్ రవికుమార్ డానియల్, సంఘసేవకుడు, సీనియర్ మీడియా ప్రతినిధి, జననేత పత్రిక ఎడిటర్ దాసరి శివకుమార్ రెడ్డి, ఉత్తమ జర్నలిస్టు చిన్నబాబు సనపల తదితరులకు ఈ అవార్డులు ప్రదానం చేశారు.







# ప్రభుత్వ భవనాల్లో అంగన్వాడీలు

**- ఐ.సి.డి.ఎస్ పథక సంచాలకులు డా. జి.జయలక్ష్మి**



శ్రీకాకుళం : జిల్లాలో ఇకపై ప్రభుత్వ భవనాల్లోనే అంగన్వాడీ కేంద్రాలు ఉండాలని, ఇందుకు నాడు - నేడు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళ,శిశు సంక్షేమ శాఖ మరియు ఐ.సి.డి.ఎస్ పథక సంచాలకులు డా.జి.జయలక్ష్మి సి.డి.పి.ఓ లను ఆదేశించారు. సోమవారం ఉదయం ఐ.సి.డి.ఎస్. కార్యాలయంలో నూతన అంగన్వాడీ భవనాల నిర్మాణం, ప్రస్తుత భవనాల మరమ్మతులపై సి.డి.పి.ఓ లతో ఆమె సమీక్షించారు. తొలుత పంచాయతీల వారీగా అద్దె భవనాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల వివరాలు తెలుసుకున్న ఆమె ఇకపై ప్రభుత్వ భవనాల్లోనే అంగన్వాడీ కేంద్రాలు ఉండాలని స్పష్టం చేశారు. నాడు - నేడు క్రింద అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. అందులో భాగంగా అద్దె భవనాల్లోని అంగన్వాడీ కేంద్రాలు ఇకపై ప్రభుత్వ భవనాల్లో ఉండాలన్నారు. ఇందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, ఆ నివేదిక తమకు అందిస్తే వాటిని సంయుక్త కలెక్టర్ కు సమర్పించడం జరుగుతుందని చెప్పారు. నూతనంగా నిర్మించబోయే అంగన్వాడీ కేంద్రాలు సచివాలయాలకు, గ్రామాలకు దగ్గరలో ఉండేవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

అలాగే ప్రస్తుతం ప్రభుత్వ భవనాల్లో ఉన్నటువంటి అంగన్వాడీ కేంద్రాలకు మరామ్మతులు చేపట్టవలసివస్తే వాటి అంచనా వివరాలను తమకు అందజేయాలని ఆదేశించారు.

ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టిని సారించాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సి.డి.పి.ఓ లు, ఐ.సి.డి.ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుడ్ని దర్శించిన మంత్రి వేణు

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్ని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన.వేణు గోపాలకృష్ణ శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వాదములు అందజేశారు.అనంతరం ఆలయ ఏసి రమేష్ బాబు శ్రీ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.



# స్టాకు పాయింట్లలో.. ఇసుక నిల్వలను పెంచాలి

**- జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ హరికిరణ్**



కడప : జిల్లాలో అందుబాటులో ఉన్న ఇసుక రీచుల నుండి అధిక మొత్తంలో ఇసుకను సేకరించి స్టాక్ పోయింట్లలో నిల్వ ఉంచాలని జిల్లా కలెక్టర్ సి.హరికిరణ్ సంబందిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్ సి) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా వినియోగదారులకు ఎలాంటి కొరత లేకుండా జిల్లాలోని అన్ని ఇసుక డిపోలలో నిల్వలు పెంచేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఇసుక అధికారులకు సూచించారు. గండికోట రిజర్వాయర్ పునరావాస కాలనీల నిర్మాణం కోసం భారీ స్థాయిలో ఇసుక అవసరం ఉంటుందని.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇసుక నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రధానంగా సి.కె.దిన్నె, కడప ఇసుక డిపోలలో ఇసుకను పూర్తి స్థాయిలో నిల్వ ఉంచేలా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇసుక డోర్ డెలివరీ నిర్వహణను నిరంతరాయంగా సాగించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాలయిన కొండాపురం మండలంలోని పొట్టిపాడు, బెడుదూరుతో పాటు యనమలచింతల, ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు, చాపాడు మండలంలోని తిప్పిరెడ్డిపల్లి(అనంతపురం), ఎర్రగుంట్ల మండలంలోని ఇల్లూరు-3 ఇసుక రీచులను కొత్తగా గుర్తించడం జరిగిందన్నారు. వీటితోపాటు గండికోట రిజర్వాయర్ తీర ప్రాంతాలయిన కొండాపురం మండలంలోని చిత్రావతి నదీ పరివాహకంలో కొత్తగా గుర్తించిన పి.అనంతపురం-3, ఏటూరు-7, ఏటూరు-8, ఎర్రగుడి.. డిసిల్టేషన్ ఇసుక రీచుల నుండి కూడా ఇసుక సేకరణకు ఆమోదం తెలిపామన్నారు. అనంతరం జిల్లాలోని ఇసుక డిపోలో స్టాకు వివరాలు, క్షేత్ర స్థాయిలో ఆపరేషన్ లో ఉన్న ఇసుక రీచుల పరిస్థితిపై వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎలాంటి కొరత లేకుండా ఇసుక రవాణా జరిగేందుకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఇసుక రీచులను సంబందిత అధికారులు తరచుగా పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా ఇసుక సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ అన్బు రాజన్ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాకు ఏ మాత్రం అవకాశం లేకుండా.. ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గట్టి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అన్ని స్టాకు పాయింట్లు, ఇసుక రీచుల వద్ద సీసీ కెమెరాల ద్వారా నిఘా పర్యవేక్షణను అమలు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో శిక్షణా కలెక్టర్ వికాస్ మర్మాట్, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఎన్ఫోర్సుమెంటు డిఎస్పీ చెంచుబాబు, మైన్స్ శాఖ ఇంచార్జి డిడి ఓబుల్ రెడ్డి, ఎడి (శాండ్) రవి ప్రసాద్, భూగర్భజల శాఖ డిడి మురళీధర్, హెూసింగ్ పిడి రాజశేఖర్, ఆర్టిఓ శాంత కుమారి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వీధి వీధికి సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు

### సుందరనగరంగా కడప పట్టణం

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు ఎస్ బి. అంజాద్బాష



కడప : - కడప పట్టణంలోని వీది వీధికి సిమెంట్ రోడ్లు డ్రైనేజీ కాలువలు నిర్వహించి పట్టణాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్బి అంజాద్బాష పేర్కొన్నారు. శనివారం ఉప ముఖ్యమంత్రివర్యులు మాజీ మేయర్ సురేష్ బాబు తో కలిసి సబ్ జైల్, శ్రీరామ్ నగర్ లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి వర్యులు మాట్లాడుతూ రాబోయే నాలుగు సంవత్సరాలలో ప్రతి వీధికి సిమెంట్ రోడ్డు డ్రైనేజీ కాలువలు, రోడ్డుకిరువైపులా మొక్కలు నాటి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.

ఈ సందర్భంగా 8.5 లక్షలతో మంజూరైన సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎర్రముక్కపల్లి సర్కిల్ నందు నూతనంగా ఏర్పాటుచేసిన రాయని ఏజెన్సీస్, విమ్ ఎలక్ట్రానిక్స్ హెూమ్ నీడ్స్ ను ఉప ముఖ్యమంత్రి వర్యులు, మాజీ మేయర్ సురేష్ బాబు లు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో 3 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి, కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, వైయస్సార్ సిపి నాయకులు సుభాన్ భాష, తదితరులు పాల్గొన్నారు.

# గోస్తనీ నదిలో బాలుడు మృతి



భీమునిపట్నం : భీమిలి మండలం సంగివలస సమీపంలో గోస్తనీ నది లో పది సంవత్సరాల గుర్రాల హరి అనే బాలుడు మృతి చెందాడు. ఉదయం నదిలో నల్గురు స్నేహితులు తో పాటు ఈతకి వెళ్లి ఒడ్డున ఆడుకుంటూ బాలుడు నది ప్రవాహానిక ఉదయం లోపలి కి కొట్టు కొని వెళ్లి పోయాడు సాయంత్రం బాలుడి మృత దేహం ఒడ్డు కి చేరుకుంది మృత దేహాన్ని పంచనామకు భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మంత్రి వెలంపల్లిని విమర్శించే అర్హత అంబికా కృష్ణకు లేదు : పెద్ది రత్నాజీ

కాకినాడ : దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ను విమర్శించే అర్హత అంబికా కృష్ణకు లేదని పెద్ది రత్నాజీ,రాష్ట్ర ఆర్య వైశ్య అధ్యయన కమిటీ సభ్యులు,వైస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పెద్ది రత్నాజీ అన్నారు.శనివారం ఆయన మాట్లాడుతూ హిందువుల మనోభావాలను ఎల్లప్పుడూ గౌరవించే దైవారాధనలో ఉండే రాష్ట్ర మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావును విమర్శించే అర్హత అంబికా కృష్ణకు లేదన్నారు

## పీఠాధిపతులను కలిసిన మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

**- అంతర్వేది ఘటనపై స్వామీజీ ఆరా**



విశాఖపట్నం : బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులను కలిసారు.

శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, శ్రీ స్వాత్మానందేంద్రల సరస్వతీ స్వామివార్ల ఆశీస్సులు అందుకున్నారు. శనివారం మధ్యాహ్నం విశాఖ శ్రీ శారదా పీఠానికి చేరుకున్నారు. పీఠం ప్రాంగణంలోని శ్రీ శారద స్వరూప రాజశ్యామల అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం అంతర్వేది ఘటనపై మంత్రి వేణుతో పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి సుదీర్ఘ సమయం చర్చించారు.

ఘటనపై లోతుగా దర్యాప్తు చేయాలని స్వామీజీ సూచించారు. హిందువుల మనోభావాలకు అనుగుణంగా దోషుల ప్రమేయముంటే కఠినంగా శిక్షించాలన్నారు. మంత్రిగా వేణుగోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించిన అనంతరం పీఠాధిపతుల ఆశీస్సులు అందుకోవడం ఇదే తొలిసారి.



## కోవిడ్ కేసుల రికవరీలో
# భారత్ టాప్



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యధికంగా కొవిడ్ -19 రికవరీలతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. రికవరీల్లో అమెరికాను అధిగమించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మొత్తం రికవరీ కేసుల సంఖ్య 42 లక్షలు దాటిందని వెల్లడించింది. వైరస్‌ను గుర్తించేందుకు ప్రభుత్వం సకాలంలో తీసుకుంటున్న సమర్థవంతమైన చర్యలవల్లే ఇది సాధ్యపడిందని తెలిపింది.

గత 24 గంటల్లో 93,337 కొత్త కేసులు, 1,247 మరణాలు సంభవించాయని మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దీంతో దేశంలో కొవిడ్ కేసుల సంఖ్య 53 లక్షలను దాటిందని తెలిపింది. ప్రస్తుతం దేశంలో 10,13,964 యాక్టివ్ కేసులు ఉండగా, 42,08,432 మంది కొవిడ్ నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయినట్లు వివరించింది. మహమ్మారి వల్ల ఇప్పటివరకూ 85,619 మంది చనిపోయినట్లు తెలిపింది.

### రాజధానిపై కేంద్రమే తుది నిర్ణయం తీసుకోవాలి

**- లోక్‌సభలో గళమెత్తిన తెదేపా ఎంపీ గల్లా**

దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై తెదేపా ఎంపీ గల్లా జయదేవ్ లోక్‌సభలో గళం విప్పారు. రాజధానిపై కేంద్రమే తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర జాబితాల్లో గానీ, ఉమ్మడి జాబితాలో గానీ లేని రాజధాని తరహా అంశంలో తుది నిర్ణయం తీసుకొనే అర్హత 248 అధికరణ ప్రకారం కేంద్ర ప్రభుత్వానికే ఉంటుందని ఆయన లోక్‌సభ దృష్టికి తీసుకొచ్చారు. అమరావతి నిర్మాణానికి నిర్మాణానికి కేంద్రం ఇప్పటికే నిధులిచ్చిందన్న ఆయన.. ఇప్పుడు తమకు సంబంధంలేదంటే ఆ సొమ్ములకు, ప్రజలకు జవాబుదారీ ఎవరని ప్రశ్నించారు.

ఇతర రాష్ట్రాలూ ఇలా చేస్తే పరిస్థితేంటి?

రాజధాని అంశం కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలో ఎక్కడా లేకపోవడంతో గందరగోళం తలెత్తిందని పేర్కొన్నారు. ఈ తరహా అంశాల్లో తుది నిర్ణయం తీసుకొనేందుకు రాజ్యాంగంలోని 248 అధికరణం ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉందని చెప్పారు.

## బీసీ సంక్షేమానికి రూ.29 వేల 800 కోట్లు

**బీసీ సంక్షేమ శాఖ మంత్రి సిహెచ్.వేణుగోపాలకృష్ణ**



విశాఖపట్నం : రాష్ట్రంలో బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం రూ.29 వేల 800 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు బి.సి. సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. శనివారం ఆయన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.త్రినాధరావు మంత్రికి స్వాగతం పలికారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వామివారి దర్శనం, అర్చన చేయించారు.

అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారిలో ఆత్మనూన్యతా భావాన్ని తొలగించి, వారిలో ఆత్మస్థైర్యం నింపేలా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు. బి.సి.ల అభ్యున్నతికి 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందని, దాన్ని ఆయన బిసి సంక్షేమ ఉద్యమంగా అభివర్ణించారు. అర్హత గల వారందరికీ సబ్సిడిపై బ్యాంకు లోన్లు, ఫీజు రీఇంబర్స్ మెంట్, ఉపకారవేతనాలను అంద జేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పూర్తి పారదర్శకంగా , ప్రజారంజకమైన పరిపాలన అందిస్తున్నారని చెప్పారు. హిందూ ధర్మరక్షణకు, హిందువుల మనోభావాల రక్షణకు ప్రభుత్వం కట్టుబడివుందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ ప్రభుత్వ కర్తవ్యమని, ఎటువంటి పరిస్థితుల్లో రాజీపడరని వెల్లడించారు. ముఖ్యమంత్రి తలంపులకు స్వామివారి ఆశీస్సులను కోరుతూ పూజలు నిర్వహించినట్లు చెప్పారు.



## బాబు తన స్వార్థం కోసం వ్యవస్థల్ని భ్రష్టు పట్టించారు



అమరావతి : కొందరు తమ స్వార్థం కోసం వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని.. వ్యవస్థల పనితీరుపై ప్రజలకు అనుమానాలు వస్తున్నాయని మంత్రి కొడాలి నాని పేర్కొన్నారు. అమరావతి రాజధాని భూకుంభకోణంపై కొడాలి నాని మీడియాతో మాట్లాడారు. ' అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందనేది వాస్తవం. చంద్రబాబు బినామీలు రాజధాని ప్రకటనకు ముందే వేల ఎకరాలు కొన్నారు. ఆయన తన ఆస్తులను కాపాడుకునేందుకే రాజధానిగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లో దోషులు ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందే చెప్పాం. అమరావతి భూ కుంభకోణంపై .. సీబీఐ దర్యాప్తు చేయాలని సీఎం జగన్ కేంద్రానికి లేఖ రాశారు. ఏ రాజకీయ నేత తీసుకోలేని నిర్ణయాలను సీఎం జగన్ తీసుకుంటున్నారు. ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి నిజాయితీగా వ్యవహరిస్తున్నారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు రాకుండా టీడీపీ సిగ్గు లేకుండా అడ్డుపడుతోంది. కేవలం తాను, తన సామాజిక వర్గమన్నదే చంద్రబాబు లక్షణం. రాజధాని పేరుతో నాడు చంద్రబాబు పెట్రో సెస్ విధిస్తే.. ఎల్లో మీడియా కళ్లు మూసుకుందా ? రహదారుల మరమ్మతుల కోసం సెస్ వేస్తే.. అదేదో మహాపాపమన్నట్లు చిత్రీకరిస్తారా?' అంటూ ధ్వజమెత్తారు

'ఐదేళ్లలో 840 బార్లను ఓపెన్ చేసిన చరిత్ర చంద్రబాబుది... తన పాలనలో దళితులకు అన్యాయం చేసిన వ్యక్తి చంద్రబాబు.. దళితులకు అన్యాయం చేసినందుకే చంద్రబాబు 23 సీట్లకు పరిమితం అయ్యారు. ఇప్పుడు దళిత శంఖారావమని చంద్రబాబు పిలుపు ఇస్తే నమ్మాలా? చంద్రబాబు దళిత ద్రోహి.. సీఎం హోదాలో ఉండి దళితుడిగా ఎవరైనా పుడతారా? అని అడిగిన వ్యక్తి చంద్రబాబు.. దళితుల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే వారే బాబుకు బుద్ధి చెబుతారు. కరోనా కష్టకాలంలో కూడా ఇచ్చిన హామీలను .. సీఎం జగన్ నెరవేరుస్తూ ప్రజలకు అండగా ఉన్నారు. మతాల మధ్య చిచ్చు పెడుతూ చంద్రబాబు తన పబ్బం గడుపుకుంటున్నారు. చంద్రబాబు జూమ్ రాజకీయాలను ప్రజలు నమ్మరంటూ' కొడాలి నాని ధ్వజమెత్తారు.

## 'మంచి నాయకుడి పాలనకు ఇదే నిదర్శనం'



నెల్లూరు : నగరంలోని పెన్నానది పరివాహక ప్రాంతాల్లో మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వరుసగా రెండోసారి సోమశిల జలాశయం పూర్తిగా నిండింది. మంచి నాయకుడి పాలనకు ఇదే నిదర్శనం. వర్షాలు బాగా కురుస్తున్నాయి. నెల్లూరులో పెన్నా బ్యారేజీ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తాం. సోమశిల నుంచి నీటి విడుదల మరింత పెరుగుతుంది. నదీ తీరంలో నివాసం ఉన్న వారు వెంటనే సహాయక శిబిరాలకు వెళ్లాలి. సోమశిల నుంచి నీటి విడుదల పెరిగే అవకాశం ఉండటంతో ఈ ప్రాంతం అంతా మునిగిపోయే అవకాశం ఉంది. తీరంలో నివాసం ఉన్న ప్రజలకు పునరావసం కల్పిస్తాం. త్వరలోనే వీరికి స్థలాలు ఇచ్చి సొంత ఇళ్లు కట్టిస్తాం' అని మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు.

**పోలవరం ప్రాజెక్ట్ పనులు...**

## రూ.760 కోట్ల బిల్లుల తిరస్కరణ

రాజ్యసభలో వి.విజయసాయి రెడ్డి ప్రశ్నకు జలశక్తి మంత్రి జవాబు



న్యూఢిల్లీ : పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులకు సంబంధించి ఏప్రిల్ 2014 నుంచి జూలై 2020 వరకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన 12,505 కోట్లలో 760.118 కోట్ల విలువైన బిల్లులు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) ఆమోదానికి నోచుకోలేదని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రతన్ లాల్ కటారియా వెల్లడించారు. రాజ్యసభలో శనివారం వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన మొత్తం ఖర్చులో 478.95 కోట్లకు సంబంధించిన బిల్లులు ఇంకా తమకు సమర్పించాల్సి ఉందని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు విడతల వారీగా 8,614 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు ఆయన చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్‌ను 2021 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యం కారణంగా వచ్చే మార్చి నాటికి 15 వేల కోట్ల రూపాయల నిధులు అవసరం ఉంటుందంటూ గత ఆగస్టు 25న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాసిన లేఖ నాలుగు రోజుల క్రితమే (సెప్టెంబర్ 15న) తమకు అందిందని మంత్రి వెల్లడించారు. పోలవరం ప్రాజెక్ట్ కోసం తదుపరి నిధుల విడుదల కోసం ఆడిట్ చేసిన ఖర్చుల వివరాలను సమర్పించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ కోరిన మీదట గత ఆగస్టు 21న రాష్ట్ర ప్రభుత్వం ఆ వివరాలను సమర్పించింది. అలాగే సవరించిన ఖర్చు అంచనాలను సైతం రివైజ్డ్ కాస్ట్ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి తుది నివేదికను సమర్పించిందని మంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్‌లో నిర్మాణ పనుల పురోగతి, వాటికి సంబంధించిన బిల్లులను పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ, సెంట్రల్ వాటర్ కమిషన్ ధృవపరచి, అవి షరతులకు లోబడి ఉన్నట్లుగా సంతృప్తి చెందిన మీదటే తదుపరి నిధుల విడుదల జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

## శరవేగంగా నూతన రథం నిర్మాణ పనులు

*రథం నిర్మాణానికి 1330 ఘనపుటడుగుల కలప వినియోగం*

తూర్పుగోదావరి : అంతర్వేది నూతన రథం నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం శరవేగంగా చర్యలు చేపడుతుంది. దీనిలో భాగంగా రావులపాలెం టింబర్ డిపోలో రథం నిర్మాణానికి అవసరమైన బస్తర్ టేకు కలప దుంగలను అధికారులు గుర్తించారు. 21 అడుగుల పొడవైన దూలాలుగా వాటిని కోయించే ప్రక్రియ ప్రారంభమైందని, రథం నిర్మాణానికి 1330 ఘనపుటడుగుల కలప వినియోగిస్తున్నామని దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. పాత రథం నమూనాలోనే అంతర్వేది ఆలయ కొత్త రథం నిర్మాణ డిజైన్లను దేవదాయ శాఖ ఖరారు చేసిన సంగతి తెలిసిందే.

41 అడుగుల ఎత్తు, ఆరడుగుల వెడల్పుతో ఏడంతస్తుల్లో ఆలయ రథం ఉంటుందని దేవదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు ఇటీవల వివరించారు. ఆరు చక్రాలతో కూడిన కొత్త రథం నిర్మాణంతో పాటు, రథశాల మరమ్మతులకు రూ.95 లక్షలు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ప్రాజెక్ట్ టెండర్లను భౌతికంగా అడ్డుకుంటే చర్యలు

**ఆర్అండ్‌బి ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు**



విజయవాడ : ప్రపంచ బ్యాంక్ నిబంధనల ఆధారిత ప్రాజెక్టులు ఉంటాయని, ప్రాజెక్ట్ టెండర్లను భౌతికంగా అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు హెచ్చరించారు. 25 టెండర్ బిడ్లు మాత్రమే వచ్చాయని, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా టెండర్లు చేసిన విషయం బహిర్గతం కావాలన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ప్రస్తుత టెండర్లను రద్దు చేసి మరల టెండరుకు వెళ్లాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు. అర్హత విషయంలో చాలా కంపెనీలు ఉన్నా, 14 కంపెనీలే టెండరు వేయడానికి కారణం తెలుసుకుంటాం. ఉన్న టెండర్లకు చాలా తక్కువ స్పందన వచ్చినందున రీటెండరింగ్‌కు వెళుతున్నాం. ప్రపంచ బ్యాంకు నియమాల ప్రకారం గత రెండు సంవత్సరాలలో ఒక కంపెనీ వంద కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలి. కాంట్రాక్టరు త్వరితగతిన కాంట్రాక్టు పూర్తిచేసే సామర్థ్యం కలిగి ఉండాలి.ఎక్కువమంది టెండరులో పాల్గొనేలా చేస్తే, రాష్ట్రంలో మరింత ఎక్కువ కిలోమీటర్లు అభివృద్ధి చేసే అవకాశం ఉంది. జ్యుడీషియల్ ప్రివ్యూ కమీషన్, రివర్స్ బిడ్డింగ్ కూడా పారదర్శకత కోసమే. కాంట్రాక్టర్లకు బ్యాంకులలో లిక్విడిటీ, కోవిడ్ కారణంగా లేబర్ అందుబాటు ఇబ్బందులు ఉండచ్చు. నిధుల లభ్యత లేదు అనే ప్రశ్నలేని ప్రాజెక్టు ఇది. అర్హత కలిగిన కాంట్రాక్టర్లతో సంప్రదించమని ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశాం. బ్యాంక్ గ్యారంటీ, జీపీఏ మాత్రమే హార్డ్ కాపీలు ఇవ్వాల్సి ఉంటుంది. ఏ రకమైన సమస్య ఉన్నా కాంట్రాక్టింగ్ ఏజెన్సీలు సరాసరి చీఫ్ ఇంజనీర్‌ను సంప్రదించవచ్చు.

టెండరు విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉన్నా ప్రభుత్వం నుంచి పూర్తి జాగ్రత్తలు తీసుకుంటుంది.

## బినామీలు గజగజ వణుకుతున్నారు

**నగిరి ఎమ్మెల్యే ఆర్కే రోజా**



తిరుపతి: అమరావతి కుంభకోణం మీద ఏసీబీ కేసు నమోదు చేస్తే చంద్రబాబు, ఆయన బినామీలు గజగజ వణుకుతున్నారని నగిరి ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. ఈ మేరకు ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'అమరావతిలో భారీ కుంభకోణం జరగింది. రాజధాని పేరుతో బాబు, ఆయన బినామీలు వేల ఎకరాలు కొనుగోలు చేశారు. టీడీపీ పాలనలో పెద్ద కుంభకోణం జరిగింది. ఈ కుంభకోణం మీద ఇప్పుడు ఏసీబీ కేసు నమోదు చేస్తే గజగజ వణుకుతున్నారు.

ఓ లాయర్ మీద కేసు నమోదు చేస్తే హైకోర్టు గ్యాగ్ ఆర్డర్ ఇవ్వడం బాధాకరం. ఇది ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నేషనల్ మీడియాతో పాటు మేధావులు హైకోర్టు ఉత్తర్వుల మీద విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అన్ని ఆధారాలతో ఏసీబీ కేసు నమోదు చేసింది. అమరావతిలో భారీ కుంభకోణం జరిగిందని స్వయంగా ప్రధాని చెప్పారు. పోలవరంను ఏటీఎంగా వాడుకున్నారని ప్రధాని చెప్పారు. కానీ చంద్రబాబు మాత్రం తేలుకుట్టిన దొంగలా ఉన్నారు. దమ్ముంటే ఇప్పుడు చంద్రబాబు అమరావతి భూ కుంభకోణం, ఫైబర్ గ్రిడ్ అక్రమాల మీద సీబీఐ విచారణ కోరాలి. అంతర్వేది ఘటనలో ప్రభుత్వం తప్పు లేకపోయినా సీఎం జగన్ సీబీఐ విచారణ కోరారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన కుమారుడి మీద ఆరోపణలు వస్తే సీబీఐ విచారణకు ఆదేశించారు. నా కొడుకు జగన్ తప్పు చేసి ఉంటే ఉరి తీయండని అసెంబ్లీ సాక్షిగా వైఎస్సార్ చెప్పారు. చంద్రబాబు స్టేలతో బతుకుతున్న వ్యక్తి. కోర్టులు కూడా అందరికి ఒకే న్యాయం లా చూడాలని కోరుతున్న' అంటూ ఆర్కే రోజా పేర్కొన్నారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com